ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org
గురువారం 26.03.2026 | సంపుటి : 12 సంచిక : 246 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# యుద్ధనష్టపరిహారం చెల్లించండి

- అబ్రహం లింకన్‌పై ఐఆర్‌జీసీ బాంబుల వర్షం
- హెచ్చరిక చేసిన గంటల్లోనే దాడులు
- కువైట్ విమానాశ్రయంపై దాడి
- యుద్ధం ముగింపునకు ట్రంప్ ముమ్మర ప్రయత్నాలు
- ఇరాన్‌కు 15 డిమాండ్ ముందు పెట్టిన ట్రంప్
- 450 కిలోల యురేనియం అప్పగించాలని షరతు
- ఇరాన్‌ను సైనికంగా అంతమొందించామని ప్రకటన
- అది ఒప్పందం కాదు..మీ ఓటమి
- శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ పోరాడతాం
- అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలపై ఇరాన్ కౌంటర్

**హర్మూజ్ జలసంధిపై సార్వభౌమాధికారాన్ని కల్పించండి**
**కాల్పుల విరమణ ప్రతిపాదన చేసిన ఇరాన్**
**పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ కీలకపరిణామం**





## ఇరాన్ సమీపంలోకి అమెరికా దళాలు

- ఏ క్షణమైన దాడికి పాల్పడేందుకు సిద్ధంగా అందబాటులో 2000 మంది ఎలైట్ బలగాలు
- ట్రంప్ మరో కీలక నిర్ణయం
- భూతల దాడులు చేస్తే తిప్పికొడుతామన్న ఇరాన్

2లో..

**టెహ్రాన్(జనంసాక్షి):** పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ఇరాన్ కీలక ప్రకటన చేసింది. యుద్ధ నష్టపరిహారం, హార్మూజ్ జల సంధిపై సార్వభౌమాధికారాన్ని కోరుతూ కాల్పుల విరమణ ప్రతిపాదన చేసింది.అంతకుముందు పశ్చిమాసియా ఘర్షణల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అమెరికాకు చెందిన విమాన వాహక నౌక యూఎస్‌ఎస్ అబ్రహాం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. ఈ విమాన వాహకనౌక కదలికలను నిరంతరం పరిశీలిస్తున్నామని, లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించిన గంటలోపే దాడి చేసింది. దానికి సంబంధించిన వీడియోను ఇరాన్ మీడియా విడుదల చేసింది.యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్ తో అమెరికా ముమ్మరంగా చర్చలు జరుపుతోంది. ఇందులోభాగంగానే నెల రోజుల కాల్పుల విరమణ కోసం 15 పాయింట్లతో కూడిన ప్రణాళికను ఇరాన్‌కు పాకిస్థాన్ అందించింది. ఇలాంటి సమయంలో తాజా ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. దీనిపై అమెరికా ఎలా స్పందిస్తుందనే దానిపై ఆందోళన నెలకొంది. అబ్రహాం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ నౌకను ఢీకొట్టాయని, దాంతో అది పనిచేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని ఇటీవల పేర్కొంది. ఆ ప్రకటనను అప్పట్లో అమెరికా తోసిపుచ్చింది. మిగతా 2లో..

## మండుతున్న ఇం'ధనం' వేళ..
# సర్కారు చల్లని కబురు

**ప్రయాణికుల కోసం 30 % భారీ రాయితీ**

- ఆర్టీసీ, మెట్రో డీలక్స్ బస్సుల్లో అమలు
- రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు..
- సోషల్ మీడియా పుకార్ల కారణంగా 25 శాతం డిమాండ్ పెరిగింది
- డిమాండ్‌మేర సరఫరా జరుగుతోందని వెల్లడి





**హైదరాబాద్(జనంసాక్షి):** పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో తలెత్తిన ఇంధన కొరత దృష్ట్యా, నగర వాహనదారులకు ఊరటనిచ్చేలా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. పెట్రోల్ బంకుల వద్ద గంటల తరబడి వేచిచూస్తున్న సామాన్యుడి కష్టాలను గమనించి, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని తక్కువ ధరకే అందించేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. హైదరాబాద్ పరిధిలోని మెట్రో ఏసీ, మెట్రో డీలక్స్ బస్సుల్లో టికెట్ ధరలపై 30 శాతం రాయితీని కల్పిస్తున్నట్లు సంస్థ ఎండీ వై.నాగిరెడ్డి ప్రకటించారు. ఈ మేరకు నగరవాసులు ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.పెట్రోల్తో ఇబ్బందులు పడటం ఎందుకు దండగ, ఆర్టీసీ బస్సులు ఉండగా! తమ బస్సుల్లో ప్రయాణించండని ఎండీ నాగిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కీలక నిర్ణయం వెనుక ఉన్న నాలుగు ప్రధాన ప్రయోజనాలను ఆయన వివరించారు. దీనివల్ల ప్రయాణికులకు సమయం, ఇంధనం ఆదా అవుతుందని ఆయన పేర్కొన్నారు. పెట్రోల్ కోసం కిలోమీటర్ల మేర క్యూలైన్లలో నిలబడి విలువైన సమయాన్ని వృథా మిగతా 2లో..

# వెంటనే పీఎన్‌జీకి మారండి



- లేకుంటే ఎల్‌పీజీ సరఫరా నిలిపివేస్తాం
- కేంద్రం ఉత్తర్వులు
- గ్యాస్ బుకింగ్‌కు 35 రోజులు.. పుకార్లేనని కొట్టిపారేసిన కేంద్రం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలో ఎల్‌పీజీ కొరతను అధిగమించడంతో పాటు గ్యాస్ పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పైప్డ్ నాచురల్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఆ కనెక్షన్‌కు మారకపోతే, 3 నెలల తర్వాత వంట గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిపివేయాలని నిర్ణయించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఎల్‌పీజీకి కొరత ఏర్పడిన మిగతా 2లో..

## అగ్నివీరులకు 20% రిజర్వేషన్లు కల్పించండి

**అన్ని రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు**



12లో..

## కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి
# రాజీనామా

- కార్యర్తల సమక్షంలో నాలుగు పేజీల లేఖ విడుదల
- పదేళ్లుగా అవమానాలు భరించాక కూడా...పట్టించుకోరా?
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందన్న భావనే లేదు
- ఇక రేవంత్ రెడ్డిపైనే తన పోరాటం కొనసాగుతుందని వెల్లడి

**జగిత్యాల(జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడానికే మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోవడానికి సిద్దంగా లేరు. ఈ క్రమంలో రాజీనామాపై మరోసారి స్పందించారు. రాజీనామా చేయడానికి గల కారణాలను వివరించారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ విధానాలకు విరుద్ధంగా తెలంగాణ కాంగ్రెస్ నడుస్తోందని జీవన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న సంతోషం లేకుండా చేశారని మండిపడ్డారు. 20 నెలలుగా పార్టీలో మానసిక వేదనకు గురైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా మిగతా 2లో..





## పెట్రోల్ కొరతపై
# పుకార్లు షికార్లు

**బంకుల వద్ద భారీగా క్యూలైన్లు**

**నగరంలో పలుచోట్ల పెట్రో బంకుల ముందు నోస్టాక్ బోర్డులు**



**హైదరాబాద్(జనంసాక్షి):**అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధంతో భారతదేశ వ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్‌కు కొరత ఏర్పడింది. కొన్ని రోజు లుగా ప్రజలు వంట గ్యాస్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. తాజా గా పెట్రోల్ నిల్వలు కూడా దేశంలో తగ్గిపోయాయన్న ప్రచారంతో బం కుల ముందు వాహనదారులు క్యూ కడుతున్నారు. ఏపీ,తెలంగాణ రాష్ట్రాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. క్యూ కట్టి మరీ బంకుల నుంచి పెద్దఎత్తున ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోనూ అవసరం లేకున్నా లీటర్ల కొద్దీ పెట్రోల్ కొనుగోలు చేస్తున్నారు వాహనదారులు. దీంతో పలు మిగతా 2లో..

# రాష్ట్రంలో పెట్రోలియం కొరతలేదు

**సరిపడా నిల్వలున్నాయి**

- ఇంధన సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేవు
- అపోహలు కలిగించే మాధ్యమాల కథనాలతో
- ఆందోళన చెందొద్దు : డిప్యూటీ సీఎం భట్టి
- ట్యాంకర్లు సకాలంలో రాకపోవడంతోనే
- నో స్టాక్ బోర్డులు
- పెట్రో కొరతపై పుకార్లు నమ్మొద్దు
- రాష్ట్రంలో 2 నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నేడు శాసనమండలి సమావేశపు హాలులో రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రామ కిషన్ రావులతో కలిసి గ్యాస్, పెట్రోల్ సరఫరాలను సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్, గ్యాస్ నిల్వలు, పంపిణీలో ఎటువంటి ఇబ్బంది లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అపోహలు కలిగించే మాధ్యమాల కథనాలతో ఆందోళన చెందవద్దని వినియోగదారులకు సూచించారు. రెగ్యులర్ గా కొనుగోలు చేసే దాని కంటే, ఎక్కువగా కొని నిల్వ చేయవద్దని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. బంకుల వద్దకు వచ్చే చివరి వాహనదాదారునికి కూడా పెట్రోల్, గ్యాస్ దొరుకుతుందనే భరోసా కల్పించాలని అధికారులు, ఏజెన్సీ లను ఆదేశించారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచుటకు రెగ్యులర్ గా ప్రెస్ బ్రీఫింగ్స్ ఇవ్వాలని సూచించారు. బ్లాక్ మార్కెట్ చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులని ఆదేశించారు. పెట్రోల్, గ్యాస్ ఏజెన్సీ లకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.పెట్రోల్, డీజిల్ లభ్యత విషయంలో ప్రజలు అపోహలను నమ్మొద్దని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మిగతా 2లో..

## దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

- ఇంధన ధరల్లో కూడా మార్పులు లేవు
- దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ సరఫరా
- బ్లాక్ మార్కెటింగ్‌పై దాడులు కొనసాగిస్తున్నాం
- పైప్డ్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో దానికే ప్రాధాన్యం
- ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ మరోసారి ప్రకటన

2లో..

## ఫార్ములా ఈ కారు రేసు కేసు పేరిట
# డైవర్షన్ పాలిటిక్స్

- పునరుద్ఘాటించిన బీఆర్ఎస్ నేత కేటీఆర్
- నేతన్నలను ఆదుకోండి
- విద్యుత్ బకాయిలు మాఫీ చేయండి
- భట్టికి భారాస నేత వినతి



**హైదరాబాద్(జనంసాక్షి):** ఫార్ములా ఈ రేసు కేసు పేరిట రాష్ట్ర ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ల నాలుగు నెలలైందని.. ప్రభుత్వానికి సంబంధించిన పత్రాలు, యంత్రాంగం అన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో ఉన్నా.. బ్యాంక్ ద్వారా అధికారికంగా నిధులు బదిలీ చేసిన ఫార్ములా-ఈ అంశం మీద మాత్రమే కేసు పెట్టగలిగారని తెలిపారు. ఈ ఏసీబీ ఛార్జ్‌షీట్ రేవంత్ ప్రభుత్వం ఎంత నిస్పృహలో ఉందో చూపించడమే కాకుండా, మా హయాంలో జరిగిన మచ్చలేని పాలనకు సర్టిఫికేట్ లాంటిదని ఆయన స్పష్టం చేశారు.బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని ఈ ఛార్జ్‌షీట్ ద్వారా స్పష్టం అవుతోందని కేటీఆర్ తెలిపారు. కేవలం అభివృద్ధే లక్ష్యంగా చేసుకుని విజయవంతంగా ప్రభుత్వాన్ని నడిపామని స్పష్టం చేశారు. ఫార్ములా-ఈ రేస్ ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచ నగరాల సరసన నిలిపేందుకు ఉపయోగించిన ?49 కోట్ల బ్యాంక్-టు-బ్యాంక్ నిధుల బదిలీని కాంగ్రెస్ ప్రభుత్వం స్కామ్ అంటుందా? అని ప్రశ్నించారు. స్కాంగ్రెస్ నాయకులారా.. రండి చూసుకుందామని సవాలు విసిరారు.

**నేతన్నలను ఆదుకోండి**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను చుట్టుముట్టిన విద్యుత్ సంక్షోభం నుంచి నేతన్నలను కాపాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మిగతా 2లో..

## దమ్ముంటే సిద్ధిపేటలో నాపై
# పోటీ చెయ్..

**సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ సవాల్**



**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి మళ్లీ సీఎం అవుతానని పగటి కలలు కంటున్నారని విమర్శించారు. దమ్ముంటే సిద్దిపేటలో తనపై పోటీ చేయాలంటూ రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. అసెంబ్లీ లాబీలో హరీష్ రావు చిట్ చాట్‌లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తల్లకిందులుగా తపస్సు చేసినా రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కాలేరని అన్నారు.అసెంబ్లీ నిర్వహణపై కూడా ఆయన విమర్శలు చేశారు. సభను సమయానికి ప్రారంభించడం లేదని, టీ బ్రేక్ పేరుతో గంటల తరబడి వాయిదాలు మిగతా 2లో..



## ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన
# పాపారావు

**ఉప ముఖ్యమంత్రి విజయశర్మ ఎదుట జనజీవనస్రవంతిలోకి కీలక మావోయిస్టు నేత**

**చర్ల(జనంసాక్షి):**మావోయిస్టు పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి, దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీ సభ్యుడు పాపారావు ఎలియాస్ సున్నం చంద్రయ్య ఎలియాస్ మంగు దాదా బుధవారం ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయశర్మ ఎదుట లొంగిపోయారు. ఆయన 17 మంది అనుచరులతో కలిసి మంగళవారం అడవి నుంచి బయటకు వచ్చారు. ఆయనపై రూ.2 కోట్లు రివార్డు ఉంది.పాపారావు 1990 నుంచి మావోయిస్టు పార్టీలో పని చేస్తున్నారు. గతంలో అనేక హింసాత్మక ఘటనలకు సూత్రధారిగా వ్యవహరించారు. దండకారణ్య జోనల్ కమిటీ మిగతా 2లో..

## ప్రేమ వ్యవహారానికి అడ్డుపడిందని
# కన్నతల్లినే కడతేర్చింది

- ప్రియుడితో కలిసి తల్లిని చంపి ఇంట్లోనే పూడ్చిపెట్టిన కుమార్తె
- జవహర్‌నగర్ పరిధి కౌకూర్ భరత్‌నగర్‌లో దారుణం

10లో..

## ప్రజల హక్కులు లాక్కోవడానికి భాజపా ప్రయత్నిస్తోంది

- ఇందుకోసం రాజ్యంగ సంస్థలను వినియోగించుకుంటోంది
- నేడు 'సర్' తీసుకొచ్చి ఓటు హక్కులను లాక్కున్నట్టే...
- రేపు 'ఎన్నార్సీ' తీసుకొచ్చి పౌరసత్వాన్ని లాగేసుకుంటోంది
- నేను బతికున్నంతవరకు ఆ ప్రయత్నాలు సాగనివ్వను : సీఎం మమత



**కోల్‌కతా(జనంసాక్షి):**అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భాజపాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఓటరు జాబితా సవరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులు లాక్కోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇందుకోసం రాజ్యాంగ సంస్థలను వాడుకుంటున్నార న్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను ఏమాత్రం పాటించట్లేదని మండిపడ్డారు. ఈ రోజు ఓటుహక్కును మిగతా 2లో..

# కవిత పార్టీకి ముహూర్తం ఖరారు

**27న శ్రీరామనవమి రోజు పార్టీ పేరు ప్రకటన**



**హైదరాబాద్, మార్చి25 (జనంసాక్షి) :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 27న శ్రీరామనవమి రోజు పార్టీకి సంబంధించిన అధికారిక ప్రకటన చేసే అవకాశముందని సమాచారం. శ్రీరామనవమి రోజు ఉదయం 8 గంటలకు కొత్త పార్టీ ఏర్పాటు తేదీని ప్రకటించే అవకాశం ఉందని తెలంగాణ జాగృతి వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన ముఖ్య అంశాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తన మెట్టినిల్లు నుంచి పార్టీ సింబల్, విధివిధానాలు ప్రకటించే అవకాశం ఉందని జాగృతి వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా, కవిత తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని కూడా ఇదే సందర్భంలో వెల్లడించవచ్చని చర్చ జరుగుతోంది.



# అంబులెన్సులు లేక ఆటోలోనే..

- వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పరిస్థితి ఇలా..

**వరంగల్ ఎంజీఎం (జనంసాక్షి) :** వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. మృతదేహాలను తరలించే అంబులెన్స్ వాహనాలు లేక, మృతదేహాన్ని ఆటోలో తరలించారు. పర్వతగిరి మండలం చౌటుపల్లి గ్రామానికి చెందిన మహిళ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం ఆమె మృతదేహాన్ని చౌటుపల్లి గ్రామానికి తరలించాల్సి ఉంది. అయితే అంబులెన్సులు లేకపోవడంతో చేసేదేమి లేక మహిళ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఆటోలో తరలించారు. ఎంతో ప్రఖ్యాతి గాంచిన ఎంజీఎంలో సౌకర్యాల పరిస్థితిని అద్దం పట్టేలా ఉన్న ఈ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది.

# మాతృత్వం ఒక వరం.. చట్టబద్ధమైన దత్తతే శ్రేయస్కరం

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**



**హనుమకొండ ప్రతినిధి మార్చి 25 (జనంసాక్షి) :** మాతృత్వం ఒక వరమని, దానికి చట్టబద్ధమైన దత్తత మార్గమే శ్రేయస్కరమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. బుధవారం కంచరకుంటలోని మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రత్యేక దత్తత విభాగాన్ని సందర్శించిన కలెక్టర్, కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ నిబంధనల ప్రకారం ఎంపికైన శిశువును హనుమకొండ జిల్లా వడ్డేపల్లికి చెందిన దంపతులకు దత్తతగా అప్పగించారు. ఆ దంపతులు నాలుగు సంవత్సరాల క్రితం దరఖాస్తు చేసుకున్నట్లు, సీనియారిటీ ఆధారంగా నాలుగు నెలల శిశువును దత్తతగా అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అక్రమ దత్తత చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడకూడదని సూచించారు. ప్రతి దత్తత కూడా కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ నిబంధనలకు అనుగుణంగా జరగాలని పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ మాట్లాడుతూ, ప్రత్యేక దత్తత విభాగం ద్వారా 2007 సంవత్సరం నుండి ఇప్పటివరకు దేశీయ దత్తత కింద 220 మంది పిల్లలను, విదేశీ దత్తత కింద అమెరికా, మాల్టా, ఇటలీ, దుబాయి వంటి దేశాలకు 12 మంది పిల్లలను దత్తతగా ఇవ్వడం జరిగినట్లు తెలిపారు. కలెక్టర్ శిశు గృహంలో ఉన్న పిల్లలతో ముచ్చటించి, దత్తతకు అందజేయబడిన శిశువును ఎత్తుకొని ఆప్యాయంగా పలకరించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, ఇంచార్జి జిల్లా శిశు పరిరక్షణ అధికారి ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం. మౌనిక, శిశు గృహ ఇన్‌చార్జి మేనేజర్ అనుముల మాధవి, సోషల్ వర్కర్ సంగి చైతన్య, నర్స్ పుల్ల మౌనిక ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నల్లాల లక్ష్మీరాజం మృతికి సంతాపం

**సామాజిక తత్వవేత్త, తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా నుండి ఎదిగిన ఒక గొప్ప రచయిత నల్లాల లక్ష్మి రాజం అకాల మరణం పట్ల సామాజిక తత్వవేత్త, తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు దిగ్భ్రాంతిని తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ప్రముఖ కథా రచయిత, నాటకకర్త, పాటల కవి,దళిత సాహితీ వేత్త నల్లాల లక్ష్మి రాజం కరీంనగర్ జిల్లా ప్రముఖ రచయితల్లో ఒకరని, వీరి 'తిరుగు ప్రయాణం' అనే కథల పుస్తకం మేము ప్రచురించడంతో పాటు విశాల సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారని, 'జీబీ రాజ్ జిందాబాద్' నాటక ప్రదర్శనతో మద్య పాన వ్యతిరేక చైతన్యం కలిగించారు. కుల వివక్ష అంటరాని తనం పై నిరంతరం పోరాటం చేసారని గుర్తు చేశారు. 'నీ బాకీ. తప్పక తీరుస్తాను. దొరలు సుంకరి పాలేరు పని చేసినపుడు, బామండ్లు మందిల్లల్ల బాసన్లు తోమినపుడు నీ బాకీ తీరుస్తాను' అనే వ్యంగ్యం హాస్యం కలగలసిన పాట బాగా ప్రాచుర్యం పొందిందని తెలిపారు. జగిత్యాల సమీపంలోని తక్కల్ల పల్లి లో జన్మించిన లక్ష్మి రాజం విప్లవ ఉద్యమాల పట్ల సానుభూతితో ఉన్నందున అనేక బాధలు పడలేక చివరకు పోలీస్ ఉద్యోగంలో చేరి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ తరఫున అనేక కళా ప్రదర్శనలు, ఇవ్వడం, కవి సమ్మేళనాల్లో పాల్గొని అధికారులతో పాటు ప్రజల ప్రశంసలు అందుకున్నారని, హెడ్ కానిస్టేబు ల్‌గా ప్రమోషన్ పొందారని, అనారోగ్యంతో 25 మార్చి 2026 న జూబ్లీ హిల్స్ అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కన్ను మూశారని తెలిపారు. వారి మరణం ఒక విషాదమని, 1992లో పరిచయమై క్రమం గా తనకు కుటుంబ సభ్యుడుగా మారిన లక్ష్మి రాజం అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వారి కుటుంబానికి తీరని శోకానికి సానుభూతిని తెలిపారు.

## ఐస్ క్రీమ్ ఇప్పిస్తామని తీసుకెళ్లి

# చిన్నారిపై లైంగికదాడి

- ఐదేళ్ల పసికందుపై అఘాయిత్యానికి పాల్పడ్డ ఇద్దరు బాలురు
- ఉదయం తీసుకువెళ్లి మధ్యాహ్నానికి ఇంటివద్దకు వదిలి వెళ్లినారు.
- ఆదివారం ఉదయం జరిగిన సంఘటన, బుధవారం ఆలస్యంగా వెలుగులోకి..



**బాలురను అబ్జర్వేషన్ హోమ్ వరంగల్‌కు తరలింపు**

చిన్నారిపై అబ్జర్వేషన్ హోమ్ వరంగల్ కు తరలించినట్లు పోలీసులు బుధవారం రోజున తమ ప్రకటనలో వెల్లడించారు. అత్యాచారం చేసిన ఫోక్సో కేసులో బాల నేరస్తులను జువెనల్ హోమ్ కుతరలింపు ఈనెల 23 న మహాదేవ్‌పూర్ ఉర్దూ స్కూల్లో చిన్నారికి జరిగిన సంఘటనఎవరులేని సమయంలో బలవంతంగా కిడ్నాప్ చేసి బలవంతంగా అత్యాచారం చేసిన బాలనేరస్తులను జువైనల్ కోర్టులో హాజరు పరచగా జువైనల్ మెజిస్ట్రేట్ బాల నేరస్తులను రిమాండ్ చేయగా వారిని అబ్జర్వేషన్ హోమ్ వరంగల్ కు తరలించడంజరిగింది. అని కాటారం డిఎస్పి ఏ సూర్యనారాయణ , మహాదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు, మహాదేవపూర్ ఎస్సై కె పవన్ కుమార్ తెలిపారు.

**మహాదేవపూర్, మార్చి 25 (జనం సాక్షి) :** సభ్య సమాజం తలదించుకునేలాంటి ఐదేళ్ల చిన్నారిపై ఇద్దరు మైనర్ బాలుర్లు అత్యాచారానికి ఒడిగట్టిన సంఘటన మహాదేవపూర్ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లేతే మహాదేవపూర్ మండల కేంద్రంలో ఆదివారం మండల కేంద్రానికి చెందిన ఓ ఐదు సంవత్సరాల చిన్నారి, తన ఇంటి ముందు ఆడుకుంటున్న క్రమంలో, పక్క వీధికి చెందిన ఇద్దరు మైనర్ బాలురు ఐస్ క్రీమ్ ఇప్పిస్తామని తీసుకువెళ్లి చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడడం జరిగింది. చిన్నారిపై అత్యాచారం చేసిన ఇద్దరు మైనర్లు ఒకరు 7వ తరగతి మరొకరు 9వ తరగతి చదువుతున్నవారు.

మహాదేవపూర్ మండలంలో పసికందుపై జరిగిన అఘాయిత్యం, మండలంతో పాటు జిల్లా రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఆదివారం రోజు ఉదయం 10 గంటల సమయంలో ఇంటి వద్ద నుండి తీసుకువెళ్లిన ఇద్దరు మైనర్ బాలురు సుమారు నాలుగు నుండి ఆరు గంటల వరకు, చిన్నారిని చిత్రహింసలకు గురిచేస్తూ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తుంది. ఆదివారంరాత్రి తల్లిదండ్రులకు, ఆ చిన్నారి భరించలేని కడుపునొప్పి వస్తుందని చెప్పడంతో, ఆసుపత్రులకు తీసుకువెళ్లిన తల్లిదండ్రులకు చిన్నారిపై అత్యాచారం జరిగిందని తెలవడంతో కన్నీరు మున్నీరయ్యారు. ఆ తల్లిదండ్రులు, తన కూతురుపై ఇద్దరు మైనర్లు అత్యాచారానికి పాల్పడ్డారని, చిన్నారి తండ్రి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

**అఘాయిత్యానికి పాల్పడ్డ బాలురు**

మండల కేంద్రానికి చెందిన ఇద్దరు మైనర్లు ఇంటి ముందు ఆడుకుంటున్న ఐదు సంవత్సరాల చిన్నారిని ఐస్క్రీం ఇప్పిస్తామని తీసుకువెళ్లి, చిన్నారిపై హత్యాచారానికి పాల్పడడం, ఆదివారం జరిగిన సంఘటన బుధవారం నాటికి వెలుగులోకి రావడం, స్థానిక ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తూ కంటతడి పెట్టించింది, ప్రస్తుతం చిన్నారి జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది, అగైత్యానికి పాల్పడ్డ ఇద్దరు మైనర్లకు పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలుస్తోంది.

# పెన్షన్ ధృవీకరణ చట్టాన్ని రద్దు చేయాలి

- ఎన్‌సీసీపీఏ తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ ఎన్.శ్రీధర్
- టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌లను సవరించాలి : ప్రధాన కార్యదర్శి నామాల సోమయ్య




**హైదరాబాద్ (జనంసాక్షి) :** పెన్షన్ ధృవీకరణ చట్టాన్ని రద్దు చేయాలని ఎన్‌సీసీపీఏ తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ ఎన్.శ్రీధర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో సాచివేత వైఖరికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్కువద్ద కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు పెద్ద ఎత్తున మాస్ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఈపిఎస్ పెన్షనర్లు మద్దత్తుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం మార్చి 25న చేసిన పెన్షన్ ధృవీకరణ చట్టాన్ని రద్దు చేయాలని, ఇది దేశ రాజ్యాంగానికి వ్యతిరేకం అనీ, 1972 నుండి అమలు చేయడానికి పూనుకోవడం విచారకరం అని అన్నారు. ఎన్‌సిసిపిఏ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల సోమయ్య మాట్లాడుతూ 8వ వేతన సవరణ కమిషన్ కు ఇచ్చిన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ లను సవరించాలని డిమాండ్ చేసారు. సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే కాలంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని ఎన్నికల్లో బిజేపీకి ఓటు వేయకుండా పెన్షనర్లను తయారు చేస్తామని అన్నారు. ఈపిఎస్ పెన్షనర్ సంఘాల ఆల్ ఇండియా కమిటి చైర్మెన్ ఎంఎన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లను మనుషులుగా చూడడం లేదనీ 30-35 సంవత్సరాలు సేవలు అందించి దేశ అభివృద్ధికి తోడ్పడిన వారు ప్రభుత్వానికి భారంగా కనిపిస్తున్నారని అందుకే వేతన సవరణ కమిషన్‌కు ఇచ్చిన సూచనలలో 'అన్ ఫండెడ్ కాస్ట్, నాన్ కాంట్రిబ్యూటరీ" లాంటి పదాలను వాడిందని వీటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేసారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి క్రిష్ణమూర్తి మాట్లాడుతూ కమ్యుటేషన్ ఆఫ్ పెన్షన్ రికవరీ కాలాన్ని గత 5 మరియు 6 వ సిపిసిల సూచనల మేరకు 15 సంవత్సరముల నుండి 12 సంవత్సరాలకు తగ్గించాలనే డిమాండ్ ని 8వ సిపిసి టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ లో పొందు పరుస్తామని గత నవంబర్ లో జరిగిన నేషనల్ కౌన్సిల్ కు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని ఇప్పటికైనా 8వ సిపిసికి ఇచ్చిన సూచనలను సవరించి రికవరీ కాలంపై తగు నిర్ణయం చేసేలా ఆదేశించాలని డిమాండ్ చేసారు. రామచంద్రుడు ఏఐబిడిపిఏ కార్యదర్శి మాట్లాడుతూ 01.01.2017 నుండి జరగవలసిన బిఎస్ఎన్ఎల్ ఎంటిఎన్ఎల్ పెన్షనర్ల పెన్షన్ సవరణని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేసారు. కె. శ్యాంసుందర్ రెడ్డి అధ్యక్షులు, సిఏపిఎఫ్ పిడబ్ల్యుఏ మాట్లాడుతూ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫారసుల ప్రకారం అడిష్ నల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ ని వెంటనే మంజూరు చేయాలని కోరారు. వి. క్రిష్ణమోహన్ చైర్మెన్ సిసిజిజిఓఓ మాట్లాడుతూ 8వ వేతన సరవణ సంఘం ప్రశ్నావళిలో దేశ రక్షణ కొరకు ప్రాణాలకు తెగించి పోరాడిన దేశ సైనికులకు ఇచ్చే పెన్షన్ ప్రభుత్వానిక భారంగా ఉందనీ, దానిని తగ్గించుకోవడానికి మార్గాలు చెప్పండని అడగడం విచారకరం అన్నారు. ఈ ధర్నాలో వివిధ పెన్షనర్ సంఘాల ప్రతినిధులు డా ఎల్ అరుణ, జె. గోపాల్ రెడ్డి, వై రాజశేఖర్ రెడ్డి, జెవిఎస్ఆర్ క్రిష్ణ, ఎం అర్జున్, జి రమేశ్, ఎస్ మహేశ్ ఏ సుధాకర్ రావు, కె శివకుమార్ గడ్డం అశోక్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

# నగరంలో చైన్ స్నాచర్ బీభత్సం

- కత్తితో బెదిరించి, పెప్పర్ స్ప్రే కొట్టి గొలుసుతో పరార్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని మియాపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. ఓ చైన్ స్నాచర్ ఏకంగా ఇంట్లోకి చొరబడి మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లాడు. నగరంలో చైన్ స్నాచర్ బీభత్సం.. కత్తితో బెదిరించి, పెప్పర్ స్ప్రే కొట్టి గొలుసుతో పరారయ్యాడు. హైదరాబాద్ మహానగరంలో రోజురోజుకు చైన్ స్నాచర్లు బరితెగిస్తున్నారు. ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారు. తాజాగా మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దుండగుడు ఇంటర్నెట్ కనెక్షన్ పేరుతో ఇంట్లోకి చొరబడి, మహిళను కత్తితో బెదిరించి బంగారు గొలుసును ఎత్తుకెళ్లిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. మియాపూర్ లోని ఓ ఇంట్లో మహిళ ఒంటరిగా ఉండటం గమనించిన దుండగుడు, తాను ఇంటర్నెట్ కనెక్షన్ రిపేర్ చేయడానికి వచ్చానని నమ్మించి ఇంట్లోకి వెళ్లాడు. అనంతరం తన వెంట తెచ్చుకున్న కత్తిని తీసి మహిళను బెదిరించాడు. ఆమె ఎదుర్కొనే ప్రయత్నం చేయగా, బాధితురాలి కళ్లలో పెప్పర్ స్ప్రే కొట్టి ఆమెను ఉక్కిరిబిక్కిరి చేశాడు. మహిళ అపస్మారక స్థితిలోకి వెళ్లగానే, ఆమె మెడలో ఉన్న సుమారు 4 తులాల బంగారు గొలుసును తెంచుకుని దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. తేరుకున్న బాధితురాలు వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# ఏజెంట్ల నిర్వాకం.. అక్రమంగా విక్రయం..

**ఆత్మకూరు, మార్చి 25 (జనం సాక్షి) :** ఆత్మకూరు మండలం లో గ్యాస్ బండ ఏజెంట్ల నిర్వా కంతో వినియో గాదారులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు.. నీరుకుళ్ళ గ్రామానికి చెందిన ఓదెల శివకుమార్ ఈనెల మూడవ తేదీన గ్యాస్ బుకింగ్ చేయగా 12వ తేదీన గ్యాస్ బండా అందినట్లు ఫోన్ కు మెసేజ్ వచ్చింది కానీ గ్యాస్ బండ రాకపోవడంతో బుధవారం ఆత్మకూరులోని శ్రీ కామాక్షి ఎంటర్ప్రైజెస్ లో సంప్రదించగా తన పేరుపై వచ్చిన గ్యాస్ బండను ఏజెంటు ఎక్కువ ధరకు ఇతరులకు విక్రయించినట్లు తేలడంతో శివకుమార్ ప్రశ్నించారు. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో చాలా మందికి గ్యాస్ బండలు అందించకుండా ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని శ్రీ కామాక్షి ఎంటర్ప్రైజెస్ పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# దశాబ్దాలు గడుస్తున్నా అందని ప్లాట్లు


**సౌన బాధితుల ఆవేదన**



**కుబీర్, మార్చి25 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని సౌన గ్రామస్తులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను వెంటనే సర్వే చేసి, వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జే.రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు గ్రామస్తులతో కలిసి కుబీర్ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1983లో సంభవించిన భారీ వరదల వల్ల సౌన గ్రామం మునిగిపోయిందని, అప్పట్లో ప్రభుత్వం స్పందించి సర్వే నంబర్ 10లో బాధితులకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేసిందని గుర్తు చేశారు. అయితే దశాబ్దాలు గడుస్తున్నా ఆ భూమిని కొలిచి, ప్లాట్లుగా విభజించి లబ్ధిదారులకు అప్పగించకపోవడం అన్యాయమని మండిపడ్డారు.

# సింగరేణిలో అప్రెంటీస్‌లకు శారీరక పనులు నిషేధం

- శిక్షణకే పరిమితం చేయాలని యాజమాన్యం కఠిన ఆదేశాలు
- అన్ని ఏరియా సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు




**హైదరాబాద్, మార్చి 25 (జనంసాక్షి) :** సింగరేణి సంస్థలో అప్రెంటిస్‌ల నియామకం, పనుల విషయంలో కీలక మార్గదర్శకాలను మానవ వనరుల అభివృద్ధి విభాగం జారీ చేసింది. ఈ నెల 23న అన్ని ఏరియా సంబంధిత శాఖ అధికారులకు ఈ మేరకు లేఖలు పంపినట్లు సమాచారం. నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ పరిధిలోని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ట్రైనింగ్, అసిస్టెంట్ అప్రెంటిస్‌షిప్ అడ్వైజర్ నుండి అందిన సమాచారంలో, కొన్ని సింగరేణి యూనిట్లలో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు, అప్రెంటిస్ ట్రైనీలను శారీరక శ్రమతో కూడిన పనుల్లో నిమగ్నం చేస్తున్నట్లు వెల్లడైనట్లు పేర్కొన్నారు. అలాగే కొందరు ట్రైనీలు కఠిన ప్రవర్తనను ఎదుర్కొంటున్నారని, సరైన అభ్యాస వాతావ రణం లేకపోవడంతో వారు ఒత్తిడికి గురవుతు న్నట్లు నివేదికల్లో వెల్లడైనట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రెంటిస్ చట్టం, సంబంధిత మార్గదర్శకాల ప్రకారం అప్రెం టిస్‌లను కేవలం శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కోసం మాత్రమే ఉపయోగిం చాలని, ఎట్టి పరిస్థితు ల్లోనూ వారిని నిత్యకృత్య లేదా శ్రమతో కూడిన పనులకు నియమించ రాదని సంస్థ స్పష్టం చేసింది. గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటిఐ అప్రెం టిస్‌లకు వారి పాఠ్యప్ర ణాళిక, అధ్యయన రంగానికి అనుగుణంగా ఉండే సాంకేతిక శిక్షణ కార్యక్రమాల్లో మాత్రమే పాల్గొనేలా చూడాలని, సంబంధిత గనులు మరియు శాఖల విభాగాధిప తులకు సూచనలు ఇవ్వాలని ఆదేశించింది. అదేవిధంగా అప్రెంటి స్‌లకు సురక్షితమైన, సహాయక, అభ్యాస కేంద్రీకృత వాతావరణాన్ని తప్పనిసరిగా కల్పిం చాలని పేర్కొంది. అప్రెం టిస్‌ల నియామకం చట్టబద్ధమైన పర్యవేక్షణలో, సీనియర్ లేదా రెగ్యులర్ సాంకేతిక సిబ్బందితో కలిసి జరిగేలా నిర్ధారించాలని కూడా సంస్థ స్పష్టం చేసింది. ఈ ఆదేశాల భాగంగా జీఎం సేఫ్టీ కార్పొరేట్, జీఎం సేఫ్టీ ఆల్ రీజియన్స్, ఏఎస్ఓ సేఫ్టీ ఆల్ ఏరియాస్, అలాగే అన్ని ఏరియాలలోని ఎం.వి.టి.సి ట్రైనింగ్ మేనేజర్లకు హెచ్ఆర్డి విభాగం నుంచి లేఖలు పంపినట్లు సమాచారం. ఇక ఈ నిర్ణయంతో అప్రెంటిషిప్ విద్యార్థుల చేత ఇప్పటివరకు చేయించబ డుతున్న శ్రమ పనులకు ముగింపు లభించినట్లే అని కార్మిక సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

# జగద్గిరిగుట్టలో బస్ డిపోను ఏర్పాటు చేయాలి

- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్
- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి

**కుత్బుల్లాపూర్, మార్చి 25 (జనం సాక్షి) :** జగద్గిరిగుట్ట లో బస్ డిపో ఏర్పాటు చేయాలని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు,బిఆర్ఎస్ ఎల్పి విప్ కెపి.వివేకానంద్ కోరారు.బడ్జెట్ సమావేశాల్లో భాగంగా హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణా అభివృద్ధిపై నగరానికి చెందిన ఎమ్మెల్యే లతో కలిసి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని పలు సమస్యలపై మంత్రి కి వినతిపత్రం అందజేశారు. అనంతరం వివేకానంద్ మాట్లాడుతూ జగద్గిరిగుట్ట లో అధునాతన బస్ టెర్మినల్ ను నిర్మించాలని, జగద్గిరిగుట్ట ప్రాంతం నుండి నగరం తోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాలకు నిత్యం వేలాదిమంది ప్రయాణికులు ప్రయాణం చేస్తూ టారని వివిధ జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చే బస్సులు రాత్రి వేళలో హాల్ట్ అవడంవల్ల సరైన సదుపాయాలు లేక రోడ్లపైనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఉందని మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకొచ్చారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు ఎటువంటి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.



జగద్గిరిగుట్ట పైప్ లైన్ రోడ్డులోని సర్వే నెంబర్. 223,224,237,238 లోగల ప్రభుత్వ భూమి బస్ డిపోకు అనుగుణంగా ఉండడం వల్ల ఆ భూమిని అభివృద్ధి పరచాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదా యాలకు సరైన ప్రజారవాణా సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని నియోజకవర్గం లోని వివిధ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల నుండి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. బాచుపల్లి,నిజాంపేట్ నుండి సికింద్రాబాద్ (వయా ప్రగతి నగర్,జేఎన్టీయూ, గండిమైసమ్మ),మెహిదీపట్నం (వయా జేఎన్టీయూ)వరకు బస్ సర్వీస్ లు నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మియాపూర్ నుండి కూకట్ పల్లి (వయా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, సాయినగర్ బాచుపల్లి)వరకు మియాపూర్ - సికింద్రాబాద్ (వయా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, సాయి నగర్ బాచుపల్లి) వరకు పొడిగించాలన్నారు. మియాపూర్ నుండి గండిమైసమ్మ (వయా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ,సాయినగర్ బాచుపల్లి)వరకు అలాగే గాజులరామారం బాలయ్య నగర్ నుండి బాలానగర్ తో పాటు కెపిహెచ్బి నుండి బాలయ్యనగర్ కు బస్సు సదుపాయం కల్పించాలని, లాల్ సాహెబ్ గూడ నుండి సికింద్రాబాద్‌కు అదనపు బస్సు సర్వీసును వేయాలన్నారు. ఎమ్మెల్యే వినతిపై సానుకూలంగా స్పందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ త్వరలోనే జగద్గిరిగుట్టలో అధునాతన బస్ టర్మినల్‌తో పాటు బస్ డిపోను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించి బస్ డిపోను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌తో పాటుగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి,ఇతర ఎమ్మెల్యేలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో రూ.60 లక్షల విలువైన మద్యం ధ్వంసం



**రాజేంద్రనగర్, మార్చి 25 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో భారీగా సీజ్ చేసిన మద్యం బుధవారం ధ్వంసం చేశారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఎక్సైజ్ రంగారెడ్డి జిల్లా కృష్ణప్రియ పర్యవేక్షణలో, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శంషాబాద్, ఏఈఎస్ శ్రీనివాస్ రెడ్డి, సి.ఐ దేవేందర్ రావు, సిబ్బంది సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.గత ఆరు నెలలుగా వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న డ్యూటీ పేయిడ్, నాన్ డ్యూటీ పేయిడ్ ఐఎంఎల్,ఎన్డిపిఎల్ మద్యం నిల్వలను శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో పంచనామా నిర్వహించి మినీ రోడ్ రోలర్ సహాయంతో ధ్వంసం చేశారు.మొత్తం 103 కేసులకు సంబంధించిన 3077 లీటర్ల మద్యం, 44 బీర్ బాటిళ్లు, మొత్తం విలువ సుమారు రూ.60 లక్షలు ఉన్న మద్యం నాశనం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఢిల్లీ, లక్నో తదితర ప్రాంతాల నుండి ఫ్లైట్, రైలు, రోడ్డు మార్గాల ద్వారా అక్రమంగా మద్యం తీసుకురావడం నేరమని, తెలంగాణలో డ్యూటీ చెల్లించని మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మై హోమ్ మంగళం రోడ్డులో ఆక్రమణల తొలగింపు



**శేరిలింగంపల్లి, మార్చి 25 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి సర్కిల్ పరిధి మై హోమ్ మంగళం రోడ్డులో ఉన్న పలు ఆక్రమణలను బుధవారం సర్కిల్ జిహెచ్ఎంసి అధికారుల ఆదేశాలతో సిబ్బంది తొలగించడం జరిగింది. కొన్ని రోజులుగా మై హోమ్ మంగళం రోడ్డు ఆక్రమణల గురించి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో సర్కిల్ అధికారులు ఎట్టకేలకు సదరు ఆక్రమణలపై దృష్టి సారించి కొంతమేర తొలగించడం గమనార్హం. బుధవారం ఉదయం జిహెచ్ఎంసి సిబ్బంది మై హోమ్ మంగళం రోడ్డుకు విచ్చేసి ఫిర్యాదులు అందిన చోట పరిస్థితులను సమీక్షించి రోడ్డును ఆక్రమించి చేపట్టిన పలు ఆక్రమణలను తొలగించడం జరిగింది. ఇందులో భాగంగా స్థానికులు మాట్లాడుతూ మై హోమ్ మంగళం రోడ్డులో రోడ్డు ఆక్రమణకు గురైందని తాను ఎన్నో మార్లు అధికారులకు వివరించడం జరిగిందని ఎట్టకేలకు బుధవారం విచ్చేసి అక్రమణాలను తొలగించడం జరిగిందన్నారు. మునుముందు మళ్ళీ వీటిని పున్నాగ నిర్మించకుండా అధికారులు బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు.

## మున్సిపల్ ఆదాయం పెంపునకు కృషి చేద్దాం

- మున్సిపల్ చైర్పర్సన్ నిరజబాల్ రెడ్డి

తాండూరు, మార్చి 25 (జనంసాక్షి) : తాండూర్ మున్సిపాలిటీ అంచనా బడ్జెట్ కు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో చైర్ పర్సన్ నీరజ అధ్యక్షతన ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 3026-2027 ఆర్థిక సంవత్సరం సవరణ అంచనా సాధారణ ఆదాయం రూ. 2751.44 లక్షలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రూ. 10.29 లక్షల ప్రారంభ నిల్వతో ఈ బడ్జెట్‌ని ఆమోదం తెలిపారు. 2026-2027 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్నుపై రూ. 10.లక్షలు, స్టాంపు డ్యూటీ కింద రూ. కోటి, తై బజార్ కింద రూ. 5 లక్షలు, మున్సిపల్ దుకాణాల ద్వారారూ. 50 లక్షలు, ట్రేడ్ లైసెన్స్ స్పీచ్ ద్వారా రూ. 50 లక్షలు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. పట్టణ ప్రణాళిక ద్వారా లేఅవుట్ ఫీజులు, బిల్డింగ్ క్రమబద్ధీకరణ రుసుము రూ. రూ. 2 కోట్ల 11 లక్షలు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఈ ఆర్థిక సంవత్సరం అంచనా సాధారణ వ్యయం రూ. 2782.64 లక్షలకు కౌన్సిల్ ఆమోదం తెలిపారు.



తాండూర్ మున్సిపాలిటీలో ఆదాయాన్ని పెంచేందుకు ప్రతి కౌన్సిలర్ సహకరించాలని, అందరం కలిసి ఆదాయాన్ని పెంచుకుని ప్రజా సమస్యల పరిష్కరించుకుందామని మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ కోరారు. బడ్జెట్ సమావేశం అనంతరం ఆమె మాట్లాడుతూ మున్సిపల్ గ్రాంట్స్ తో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ నిధులను కూడా తెచ్చుకుని అభివృద్ధి చేసుకుందామన్నారు. మున్సిపల్ పరిధిలో ఏ కార్యక్రమం జరిగిన కౌన్సిలర్లకు తప్పనిసరి సమాచారం అందించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కుక్కల నియంత్రణ కోసం జిల్లా కలెక్టర్ కు లేఖ రాస్తున్నట్లు ఆమె సభ్యులకు వివరించారు. శివారు ప్రాంతానికి కూడా మిషన్ భగీరథ తాగునీటి వ్యవస్థను తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె వివరించారు. పట్టణంలోని పార్కు స్థలాలను గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకొని ఉన్నట్లు ఆమె వివరించారు. సమావేశంలో వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్,కమిషనర్ మధుసూదన్ రెడ్డి, డి ఈ మణిపాల్, బిఆర్ఎఫ్ ఫ్లోర్ లీడర్ దీప, మేనేజర్ నరేందర్ రెడ్డి, అకౌంటెంట్లు వాణి, శివ కుమార్, ఏఈలు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, తదితరులుఉన్నారు. ఈ సమాజంలో పలు సమస్యలను సభ్యులు ప్రస్తావించారు.

## పేద ప్రజలకు గూడు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, మార్చి 25 (జనంసాక్షి) :** పేద ప్రజలకు గూడు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ 8వ వార్డు పామెనలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిమించుకొని ఇంట్లోకి వెళ్ళినరోజు మనందరికీ ఆనందకరమైన రోజనీ, పేద ప్రజలకు గూడు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆ లక్ష్యంతో నిర్మించిన ఈ ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించడం నాకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఒక భద్రత, గౌరవం, భవిష్యత్తుకు బలమైన పునాది. ఇంటి ద్వారా కుటుంబం సంతోషంగా, సురక్షితంగా జీవించాలని కోరుకుంటున్నానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉంది. ప్రతి అర్హులైన కుటుంబానికి ఇల్లు కల్పించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాము. చేవెళ్ల నియోజకవర్గంలో కూడా ఇలాంటి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్ లు బందారీ శైలజఆగి రెడ్డి, దావల్గారి గోపాల్ రెడ్డి, పైండ్ల మధుసూధన్ రెడ్డి, తాళ్ళపల్లి శ్రీనివాస్, ఎర్ర గోపాల్, పడాల ప్రభాకర్, శ్రీనివాస్ గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఆదేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి



**చేవెళ్ల, మార్చి 25 (జనంసాక్షి) :** ప్రభుత్వం ఆదేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ స్పష్టం చేశారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని రేగడి ఘనపూర్ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నర్సరీ లోని మొక్కలను పరిశీలించారు. అనంతమైన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆలోచించిన లక్ష్యాలను గ్రామ కార్యదర్శులు నిందిత గడువులోగా పూర్తిచేయలన్నారు. పనులు ఈ నెల ఆఖరి వరకు పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ప్రజల ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ మాధవి రామ్ రెడ్డి, ఉప సర్పంచ్ మహేశ్వరి రాములు, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## విద్యకు బడ్జెట్ లో 30% నిధులను కేటాయించాలి

- ఏఐఎస్ఎఫ్ ఛలో అసెంబ్లీలో ఉద్రిక్తత



హయత్‌నగర్, మార్చి 25 (జనం సాక్షి) : విద్యారంగానికి తగిన ప్రాధాన్యం కల్పించాలనే డిమాండ్‌తో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. బడ్జెట్‌లో విద్యకు తక్కువ నిధులు కేటాయించడం పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిర్వహించిన చలో అసెంబ్లీ కార్యక్రమం లో నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈనపల్లి ఉపేందర్ ను అదుపులోకి తీసుకున్నారు. కొంతసేపు పోలీసులకు, విద్యార్థి నాయకులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ సందర్భంగా సామిడి వంశి వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో పేర్కొన్న విధంగా విద్యారంగానికి సరైన నిధులు కేటాయించలేదని ఆరోపించారు. ప్రస్తుతం కేటాయించిన నిధులు సరిపోవని, కనీసం 30 శాతం బడ్జెట్‌ను విద్యకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యారంగంలో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యను బలోపేతం చేయాల్సిన సమయంలో నిర్లక్ష్యం చేయడం బాధాకరమని, సమస్యలు ప్రస్తావిస్తే అరెస్టులు చేయడం అన్యాయమని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యారంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

## మున్సిపాలిటీ పరిధికి డంపింగ్ యార్డు కోసం భూమి కేటాయించాలి



**చేవెళ్ల, మార్చి 25 (జనంసాక్షి) :** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధికి డంపింగ్ యార్డు కోసం 5 ఎకరాల భూమిని కేటాయించాలని చేవెళ్ల ఆర్డీవో కె.పార్థ సింహారెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్యలను బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఆగిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తాళ్లపల్లి నర్సింలు, మంగమ్మ మల్లేష్, దూత మల్లేష్, కృష్ణానాయక్ లు కలిసి వినతిపత్రం సమర్పించారు. డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని పరిశీలిస్తామని ఆర్డీవో, తహశీల్దార్ లు సానుకూలంగా స్పందించారని చైర్ పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదిరెడ్డి, డప్పు చందు తదితరులు ఉన్నారు.

## పీఎం సూర్య ఘర్ యోజన ప్రచార రథం ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 25 (జనం సాక్షి) :** జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పి.ఎం. సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా సౌరశక్తి వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పైకప్పులపై సోలార్ పలకలను ఏర్పాటు చేసుకొని, అవసరమైన విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని, హరిత ఇంధన వినియోగాన్ని పెంచి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సోలార్ వ్యవస్థల ద్వారా ఇంటి అవసరాలకు మించి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి అదనపు ఆదాయం పొందే అవకాశమూ ఉందని తెలిపారు.

# బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరి వేయించాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి, మార్చి 25 (జనం సాక్షి) :** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో కీలకమైన హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను జిల్లాలోని 14-15 సంవత్సరాల బాలికలందరికీ మిషన్ మోడ్‌లో అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వైద్య అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ వైద్యశాఖ అధికారులతో హెచ్‌పీవీ వ్యాక్సిన్ అమలు, మహిళా స్వయం సహాయక సంఘాల హెల్త్ ప్రొఫైల్, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలపై సమీక్ష సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను 14-15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలందరికీ తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి డీఆర్‌డీఓఏ, మెప్మా, డీఈఓలతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, బాలికలను సమీప పీహెచ్‌సీలకు తీసుకువచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని



ఆదేశించారు. జిల్లాలోని అర్హులైన అందరు బాలికలకు మిషన్ మోడ్‌లో వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య స్క్రీనింగ్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు.జిల్లాలో ఇప్పటివరకు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో స్పెషలిస్ట్ డాక్టర్లతో నిర్వహించిన క్యాంపులు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో టీవీపీ స్పెషలిస్ట్ డాక్టర్లు, ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా నిర్వహించిన స్క్రీనింగ్ కార్యక్రమాల వివరాలను వైద్య అధికారులు కలెక్టర్‌కు వివరించారు. స్క్రీనింగ్ సమయంలో గుర్తించిన అనుమానాస్పద కేసులను తదుపరి పరీక్షలు, చికిత్స కోసం రిఫర్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఒక పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలో స్పెషలిస్ట్ డాక్టర్లతో స్క్రీనింగ్ నిర్వహించడంతో పాటు, రోజుకు 9 రెసిడెన్షియల్ పాఠశాలల్లో టీవీపీ స్పెషలిస్ట్ డాక్టర్లు, ఆర్‌బీఎస్‌కే బృందాలు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల మహిళల హెల్త్ ప్రొఫైల్ అమలుకు సంబంధించి పూర్తి కార్యాచరణ ప్రణాళికతో షెడ్యూల్ సిద్ధం చేయాలని డీఆర్‌డీఓఏ అధికారులకు ఆదేశించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు అవసరమైన మౌలిక వసతులు, ఇంటర్నెట్ సదుపాయం, నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి సూచనలు చేశారు.ఈ సమావేశంలో డీఆర్‌డీఓఏ జ్యోతి, అడిషనల్ పీడీ సూర్యారావు, డీసీహెచ్ఎస్ కవిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డాక్టర్ శశాంక్ తదితర వైద్యాధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
26 మార్చి 2026

# నిమ్జ్ సర్వే త్వరగా పూర్తి చేయాలి




**సంగారెడ్డి, మార్చి 25 (జనం సాక్షి) :** జహీరాబాద్ నిమ్జ్ పరిధిలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను అనుసంధానిస్తూ మౌలిక సదుపాయాల ప్రణాళిక రూపొందించేందుకు సర్వే కీలకమని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. జిల్లాలోని టీజీఐఐసీ భూములు, అలాగే నిమ్జ్ఎ , ఎన్ఐసీడీసీ పరిధిలోని భూముల అభివృద్ధి, సర్వే ప్రక్రియలపై జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నిమ్జ్, టీజీఐఐసీ, సర్వే, రెవెన్యూ అధికారులతో కలిసి బుధవారం సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు లేఅవుట్ అభివృద్ధి కోసం త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లేఅవుట్ ప్రకారం రహదారులు , ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు ముందుగా అవసరమైన విద్యుత్, నీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అనుగుణంగా సర్వే నిర్వహించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జహీరాబాద్ నిమ్జ్ పరిధిలో భూముల అనుసంధానం, మౌలిక వసతుల ప్రణాళిక రూపొందించడంలో సర్వే కీలకమని మరోసారి స్పష్టం చేశారు. సర్వే పనులు వేగవంతం చేసేందుకు రెవెన్యూ, సర్వే, పోలీస్ శాఖల సమన్వయంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కొలతలతో సర్వే పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా, సేకరించిన భూముల ప్రస్తుత స్థితి, పెండింగ్ సమస్యలు, భూ స్వాధీనం ప్రక్రియలో ఉన్న అంశాలను సమీక్షించారు. అడ్వాన్స్ పోజెషన్, భూముల బదిలీ అంశాలపై ప్రత్యేకంగా చర్చించి రిజిస్ట్రేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని నిర్ణయించారు. పరిశ్రమల అభివృద్ధికి ఆటంకాలు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ కలెక్టర్ మాధురి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ విఠల్, జహీరాబాద్ ఆర్డీవో దేవుజా, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

## సేవాలాల్ పుణ్యక్షేత్రం హైదరాబాద్‌లోనే ఉండాలి



**తూప్రాన్, మార్చి 25 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా తూప్రాన్‌లో సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం హైదరాబాద్ లో ఏర్పాటు కోసం గురువారం అసంబ్లీ ముట్టడికి వెళ్తున్న బంజారాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు తూప్రాన్ మున్సిపల్ కౌన్సిలర్ జైపాల్ నాయక్ తో పాటు మరికొందరిని పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం అడవిలోనే ఉండాలా..? లంబాడీల కోరిన చోట సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం ఏర్పాటు చేయాలని లంబాడీల ఆత్మగౌరవం ఉంటుందని సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం అడవిలోనే ఉండాల్నా హైదరాబాదులో ఉండకూడదా అని ఆలోచనతో మేము అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో ఈరోజు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తుంటే తూప్రాన్ పోలీస్ స్టేషన్ లో అరెస్ట్ చేయడం జరిగింది అరెస్ట్ కుట్రలతో ఏవి చేసిన హైదరాబాదులోనే పుణ్యక్షేత్రం ఉండేలా చేయాలని లేని ఎడల ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని బంజారాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అన్ని కుల సంఘాలు ఆధ్వర్యంలో చర్చించి కార్యచరణ ప్రకటిస్తామని జైపాల్ నాయక్ తెలిపారు.

## ముందస్తు అరెస్టులు ప్రభుత్వ నియంతృత్వ పోకడకు నిదర్శనం




**వనపర్తి బ్యూరో, మార్చి 25 (జనం సాక్షి) :** విద్యార్థుల సమస్యలు పాలకుల దృష్టికి తెచ్చేందుకు ఏఐఎస్ఎఫ్ అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో వనపర్తి పోలీసులు ఏఐఎస్ఎఫ్ నేతలను ముందస్తు అరెస్టు చేసి స్టేషన్కు తరలించడం ప్రభుత్వ నియంతృత్వ పోకడకు నిదర్శనమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్చార్జ్ రమేష్ విమర్శించారు. ఈరోజు ఉదయం అరెస్టు సందర్భంగా వనపర్తి పోలీస్ స్టేషన్లో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు, గదులు, మరుగుదొడ్ల కొరత ఉందన్నారు. సరైన బోధనోపకరణాలు లేవన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో విద్యారంగానికి 15% నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి 2026- 27 బడ్జెట్లో 8.2% నిధులు మాత్రమే కేటాయించటం ప్రభుత్వ విద్యపై లోపించిన చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. రాష్ట్రం 30%, కేంద్రం పై శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు పిల్లల స్కాలర్షిప్లు ఫీజు రియంబర్స్మెంట్ కూడా చెల్లించలేదు అన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ 8000 కోట్లు బకాయి ఉండటంతో యాజమాన్యాలు పిల్లలను కళాశాలలోకి రానీయటం లేదన్నారు.ఇంటిగ్రేటెడ్ స్కూల్ ల పేరుతో ఊహాలోకంలో వివరించటం మాని ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్, డివిజన్ కార్యదర్శి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



**తూప్రాన్, మార్చి 25 (జనం సాక్షి) :** ఆశ వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవాలని, అసెంబ్లీ సమావేశాల్లో వాటిపై సమగ్రంగా చర్చ జరగాలని జిల్లా ఇంచార్జి శారదా, పట్టణ ఇంచార్జి సమాతా లు డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా లోని ప్రధాన రహదారిపై బైఠాయించి రెండు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదంటూ ఆశ వర్కర్లు పెద్ద సంఖ్యలో ధర్నా నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఆశ వర్కర్లకు పలు హామీలు ఇచ్చి, అనంతరం వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం ఆశ వర్కర్ల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ, వెంటనే కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.18000గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. వేతనాలు ఇవ్వకపోవడంతో ఇంటి అద్దె, స్కూల్ ఫీజులు, ఇంటి ఆర్థిక పరిస్థితి బాగోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని వేతనాల చెల్లింపుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించి, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా,హెల్త్ కార్డు లు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎఎన్‌సి టార్గెట్‌లు, ఆన్లైన్ వర్క్ లు తీసివేసి,సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు, అధికారుల మరియు రాజకీయ నాయకుల వేధింపులను నిలిపివేయాలని, జనాభా ప్రాతిపదికన ఆశ వర్కర్ లను నియమించాలని వారు డిమాండ్ చేశారు.ధర్నా నిర్వహిస్తున్నారు అని విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వారిని పంపించే తరుణంలో పోలీసులకు ఆశ వర్కర్ లకు తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ కార్యక్రమంలో లత, శారదా, నయనిత,లక్ష్మి, భారతి,శోభ, మున్ని,వెంకట లక్ష్మి, స్వరూప, భాగ్య, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్ పనుల పురోగతిని పరిశీలించిన అదనపు ఎస్పీ



**మెదక్, మార్చి 25 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)కు సంబంధించిన పెట్రోల్ బంక్ పనుల పురోగతిని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ పరిశీలించారు. బుధవారం ఆవుసులపల్లి గ్రామ పరిధిలో నిర్మాణంలో ఉన్న పెట్రోల్ బంక్ పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి, పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను తెలుసుకుని, అవసరమైన మౌలిక సదుపాయాలను సక్రమంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు ఇంధన సౌకర్యం అందుబాటులోకి రావడం ద్వారా స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.అదనపు ఎస్పీ వెంట ఏఆర్ డియస్పి రంగా నాయక్, ఆర్ఎసై మహిపాల్ సిబ్బంది ఉన్నారు.

# విజయవంతంగా హజ్ వ్యాక్సినేషన్ కార్యక్రమం

- హజ్ యాత్రికుల కోసం సమగ్ర వైద్య సేవలు
- డీఎంహెచ్ఓ డా. రవి కుమార్ నాయక్




**నాగర్‌కర్నూల్, మార్చి 25 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లాలో హజ్ యాత్రికుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. రవికుమార్ నాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఉషారాణి, హజ్ కమిటీ అధ్యక్షుడు ఫరీద్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. రవి కుమార్ నాయక్ మాట్లాడుతూ, హజ్ యాత్రికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమగ్ర వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. యాత్రికులకు షుగర్, బీపీ, రక్తపరీక్షలు, ఎక్స్-రే పరీక్షలు నిర్వహించడంతో పాటు జనరల్ ఫిజిషియన్ వైద్యుల ద్వారా పూర్తిస్థాయి ఆరోగ్య పరీక్షలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం అవసరమైన వాక్సిన్లు అందించి, యాత్రికులు సురక్షితంగా యాత్ర సాగించేందుకు అవసరమైన వైద్య చర్యలు తీసుకున్నామని వివరించారు. జనరల్ ఆసుపత్రి వైద్య బృందం, హజ్ జిల్లా కమిటీ సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. సురేష్ బాబు, జనరల్ మెడిసిన్ ఎచ్.ఓ.డి. డా. సూర్యనారాయణ, పీపీ యూనిట్ వైద్య అధికారి డా. సృజన, జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, విసిసిఎమ్ దివ్యతో పాటు హజ్ కమిటీ సభ్యులు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన వైద్యంతో పాటు మంచి విద్యాబోధన అందించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**వెల్దుర్తి, మార్చి 25 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థినిలకు భోజనం ఏర్పాటులో మెరుగైన ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.బుధవారం ఆకస్మికంగా మెనూ అందించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కస్తూరిబా బాలికల విద్యాలయంలో ఆర్ బి ఎస్ కే ఆరోగ్య శిబిరం నిర్వహించి బాలికల గైనకాలజీ సమస్యలకు చికిత్సలు అందించడం తోపాటు , బాలికల ఆరోగ్య పరిరక్షణ పై అవగాహన కల్పిస్తున్నామన్నారు.శిబిరాల ద్వారా చిన్నపాటి ఆరోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి, ఉచితంగా చికిత్స మరియుఅత్యున్నత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.కస్తూరిబా బాలికల విద్యాలయంలో విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్య అందుతుందని విద్యార్థినిల విద్యాసామర్థ్యాలు సంతృప్తినిచ్చాయని డిసిహెచ్ఎస్ శివదయాల్ మాట్లాడుతూ విద్యార్థులలో పౌష్టికాహార లోపం ఐరన్, విటమిన్, థైరాయిడ్,కంటి సమస్యలతో పాటు నెలసరి సమస్యలు గుర్తించి వాటి నిర్మూలనకు పూర్తిస్థాయిలో చికిత్స అందించేందుకు పాఠశాలలో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు ఇప్పటివరకు జిల్లాలో216 విద్యార్థులకు పరీక్షలు పూర్తయినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్ కేజీబీవీ ఉపాధ్యాయులు హెల్త్ క్యాంప్ వైద్యులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలకు పాల్పడితే కేసులు తప్పవు

- ఐసిడిఎస్ పర్యవేక్షకులు జహనాభి



**న్యాల్‌కల్, మార్చి 25 (జనం సాక్షి) :** బాల్య వివాహాలకు పాల్పడితే తల్లిదండ్రులు, అందుకు ప్రోత్సహించిన వ్యక్తులకు కేసులు తప్పవని, బాల్యవివాహాలు జరక్కుండా ప్రోత్సహించాలని న్యాల్ కల్ మండలం, గంగ్వార్ ఐసిడిఎస్ క్లస్టర్ పర్యవేక్షకులు జహనాభి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని మిర్జాపూర్ (బి) గ్రామంలో గ్రామ సర్పంచ్ నిర్మల రెడ్డి అధ్యక్షతన బాల్యవిహాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని మూడు అంగన్వాడి కేంద్రాలకు చెందిన బాల, బాలికలకు యూనిఫామ్ అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, అంగన్వాడి కార్యకర్తలు శోభ, దీనమ్మ, సంగమ్మ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యాలిడేషన్ యాక్ట్ కు పెన్షనర్లు నిరసన



**చేర్యాల, మార్చి 25 (జనంసాక్షి) :** భారత కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లులో ప్రవేశపెట్టిన వ్యాలిడేషన్ యాక్ట్ కు నిరసనగా,ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ నిర్ణయానుసారంగా బుధవారం ప్రొటెస్ట్ డే గా దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు నిర్వహించారు. వ్యాలిడేషన్ యాక్ట్ ప్రకారం 01 జనవరి 2026 ముందు రిటైర్ అయిన వాళ్ళ పిఆర్సి, అలవెన్స్ ల విషయంలో హక్కులు హరించే విధంగా ఉన్నాయి అని. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం చేర్యాల మండల శాఖ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్‌లు ధరించి వ్యాలిడేషన్ యాక్ట్ వెంటనే ఉపసహరించుకోవాలని కోరుతూ మెమోరాండం తహసిల్దార్ చేర్యాల ద్వారా ప్రధానమంత్రికి పంపింగలరని రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి కి పెన్షనర్ల మండల శాఖ అధ్యక్షులు కే. రఘుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.నరసింహులు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం మల్లారెడ్డి, కె.వెంకట్ రాములు,మండల శాఖ కార్యవర్గం బి సుధాకర్,టి.వి. నారాయణ, వి యశోద, జి కృష్ణారెడ్డి, ఏ.సుదర్శనం, పి.చంద్రం, జి. చంద్రమౌళి మరియు పెన్షనర్లు కనకయ్య,రామ్మూర్తి,లక్ష్మణ్,బాపు, మల్లయ్య, గాలయ్య, సుదర్శనం రాజేశం, వేణుగోపాల్, హరిరాములు, శ్రీనివాస్, రాములు,యాదగిరి, రామచంద్రారెడ్డి, ఐలయ్య, సత్యనారాయణ,యాదయ్య, రాం రెడ్డి, వెంకటేశ్వర్లు, సుధాకర్ మొదలగు వారు పాల్గొన్నారు.

## సక్రమంగా నాణ్యమైన సన్నబియ్యం సరఫరా



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 25 (జనం సాక్షి) :** సక్రమంగా నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. బుధవారం మెదక్ పట్టణంలో మార్కెట్ యార్డ్ దగ్గరగా ఉన్న ఎం ఎల్ ఎస్ పాయింట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో పెండింగ్ ఉన్న రేషన్ షాపులకు బియ్యాన్ని త్వరగా సరఫరా చేయాలని కలెక్టర్ సూచించారు. ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద కలెక్టర్ స్టాక్ రిజిస్టర్, ఇష్యూ రిజిస్టర్, గూడ్స్ రిజిస్టర్ రికార్డులను, ఆన్‌లైన్ రికార్డులను, వెయింగ్ యంత్రాల రిసిప్ట్‌లను పరిశీలించారు. మూడు నెలల బియ్యం సరఫరా గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ జగదీష్,తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ చేపట్టిన మిషన్ భగీరథ పథకం దేశానికే తలమానికం

- మంచినీటి ఎద్దడికి కారణం ప్రభుత్వ అసమర్థత
- మిషన్ భగీరథ ప్లాంట్ సందర్శించి పరిశీలించిన మాజీ మంత్రి



**వనపర్తి బ్యూరో, మార్చి 25 (జనం సాక్షి) :** కెసిఆర్ చేపట్టిన, మిషన్ భగీరథ పథకం, దేశానికి తలమానికమని, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.బుధవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రేవెల్లి మండలం గౌరీదేవిపల్లి దగ్గర ఉన్న మిషన్ భగీరథ ప్లాంటును సందర్శించి, వేసవిలో మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శమైన మిషన్ భగీరథ పథకం కె.సి.ఆర్ అమలు చేసి, మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నారని కొనియాడారు.గౌరీదేవిపల్లి మిషన్ భగీరథ పథకం,ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలలో 17నియోజకవర్గాలకు వరప్రదాయినిగా నిలిచిందన్నారు. కె.ఎల్.ఐ పథకంలో అంతర్భాగమైన ఏలూరు రిజర్వాయర్ ద్వారా రా నీటిని పంపింగ్ చేసి, శుద్ది చేసిన మంచినీటిని ప్రజలకు అందించామని అన్నారు.దీనికి సమాంతరంగా వనపర్తికి మంచి నీళ్లను అందించే స్కీమ్ కూడా ఇక్కడే ఉందని పేర్కొన్నారు.దేశంలోనే ప్రతిష్ఠ తెచ్చుకున్న మిషన్ భగీరథ పథకానికి నిర్వహణ సామర్థ్యం లేక కరెంట్ కోతలతో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.ప్రభుత్వ సమర్థత వల్ల వనపర్తి జిల్లా కేంద్రములో పలుచోట్ల నీటి ఎద్దడి ఏర్పడి ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం కొత్త పథకాలు అమలు చేయలేకపోయిన గతములో ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు.నిరంజన్ రెడ్డి వెంట గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్ నందిమల్ల.అశోక్,భీమన్న, మధుసూదన్ రెడ్డి,సురేందర్ రెడ్డి,శివరామ్ రెడ్డి వివిధ మండలాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY


## విద్యారంగ బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**కాసిపేట మార్చి 25 (జనం సాక్షి) :** విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని కాసిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేస్తూ అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సౌకర్యాలను కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్య బోధన అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులు, అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. మండల కేంద్రంలో పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ, నివాస ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, రహదారులు, మురుగు కాలువలలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి శుభ్రంగా ఉంచాలని తెలిపారు. లబ్ధిదారులు తమకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని, ఆ దిశగా అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం లంబడితండ (కె) గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలోని పల్లె దవాఖానను సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, పారిశుధ్య నిర్వహణ, రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. పెద్దనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి గ్రామంలో ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సర్దార్ అలీ, సర్పంచ్ లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## బాసర రైల్వే స్టేషన్ పరిసరాల్లో
# ప్రభుత్వ భూమి కబ్జా

- ఇరుకుగా మారిన రైల్వే స్టేషన్ మార్గాలు



**నిర్మల్ బ్యూరో, మార్చి 25 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా బాసర రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూమిలో అక్రమ కబ్జాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్త పరుస్తున్నారు.. . రైల్వే స్టేషన్ మార్గానికి ఇరువైపులా కొంతమంది వ్యక్తులు స్థలాలను ఆక్రమించి హోటళ్ళు, షాపులను ఏర్పాటు చేసుకుని వ్యాపారం నిర్వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కబ్జాల కారణంగా రైల్వే స్టేషన్ పరిసరాలు రోజురోజుకూ ఇరుకుగా మారుతున్నాయి. ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రైలు వచ్చిపోయే సమయంలో పరిసర ప్రాంతాలు రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక నివాసితులు పలుమార్లు సంబంధిత రెవిన్యూ, గ్రామపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా నిర్మించిన ఈ షాపులను వెంటనే తొలగించి స్టేషన్ పరిసరాలను విస్తరించాల్సిందిగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రెవిన్యూ అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకుని ప్రయాణికులకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

### కలెక్టర్ అమ్మ మీకు కనిపించదా!

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రతినిత్యం వేల సంఖ్యలో యాత్రికులు బాసరకు వస్తుంటారు. యాత్రికుల సౌకర్యార్థం గత రెండు సంవత్సరాలలో బాసర అమ్మవారిని దర్శించుకునేందుకు నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పలుమార్లు బాసరకు వచ్చారు కానీ ఆమె ఈ అక్రమ కబ్జాలను గుర్తించకపోవడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అదేవిధంగా జిల్లాని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాపు కాసే జిల్లా పోలీసు అధికారి డాక్టర్ జానకి షర్మిల బాసర ఉత్సవాలలో భద్రత కల్పించేందుకు పలుమార్లు వచ్చినప్పటికీ ఆమెకు కూడా అక్రమ కబ్జాలు కనిపించకపోవడం ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. స్థానిక జిల్లా ఉన్నత అధికారులే బాసర అభివృద్ధిని కోరుకోవడం లేదని బాసర ప్రజలు చర్చించుకుంటున్నారు.

### కబ్జాలపై పట్టింపు లేని బాసర మండల అధికారులు

బాసర రైల్వే స్టేషన్ ఎదురుగా మండల తహసిల్దార్ కార్యాలయం, కూతవేటు దూరంలో ఎంపీడీవో కార్యాలయం ఉన్నప్పటికీ కబ్జాలను తొలగించే నాథుడే బాసరలో కరువయ్యాడు. ప్రతినిత్యం వేల సంఖ్యలో యాత్రికులతోపాటు వీఐపీలు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు బాసర అమ్మవారిని దర్శించుకుంటూ ఉంటారు. ఆలయానికి వచ్చే వీరికి కూడా ఈ కబ్జాలు కనిపించడం లేదని బాసర అభివృద్ధిపై ఎవరికి పట్టింపు లేదని బాసర గ్రామస్తులతో పాటు మండల కేంద్రంలోని పలు గ్రామాల ప్రజలు స్థానికంగా చర్చించుకుంటున్నారు.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియకు సహకరించాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు, మార్చి25 (జనంసాక్షి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తెలిపారు.బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు లో ములుగు నియోజకవర్గంకు సంబంధించిన ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ జిల్లాలో 72.47 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా పూర్తిచేయాలంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలను వెంటనే సమర్పించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు మ్యాపింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు, రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఇప్పటివరకు జాబితాలను అందించని రాజకీయ పార్టీల ప్రతినిధులు తక్షణమే అందించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు రాజకీయ పార్టీలు పాల్గొనాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్డీవో వెంకటేష్, ఎన్నికల విభాగం ఇంచార్జి సూపరింటెండెంట్ సలీం,డిటి నితీష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మొబైల్ ఫోన్ల రికవరీలో అద్భుత ఫలితాలు

- 10లక్షల విలువ గల 108 మొబైల్ ఫోన్లు రికవరీ
- మొబైల్ యజమానులకు అందజేత
- జిల్లా ఎస్పీ నితిక పంత్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 25(జనంసాక్షి) :** జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి జిల్లాలో గత కొన్ని రోజుల నుండి పోయిన , చోరీకి గురైన సుమారు 10లక్షల రూ.విలువ గల 108 ఫోన్ల ఆచూకీ మన రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుండి రికవరీ చేసి జిల్లా ఎస్పీ నితిక పంత్ చేతుల మీదుగా బుధవారం సంబంధిత మొబైల్ ఫోన్ల యజమనులకి అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ లేనిదే ఒక చిన్న లావాదేవీ కూడా చేయలేని, మన యొక్క విలువైన సమాచారం బ్యాంక్ అకౌంట్స్, పాస్ వర్డ్స్ వంటివి మొబైల్లో సేవ్ చేసి పెట్టుకుంటారని తెలిసిన నేరగాళ్లు మొబైల్ దొంగిలించి,వీక్ పాస్ వర్డ్స్ లను బ్రేక్ చేసి ఫోన్ పే,గూగుల్ పే తదితర మధ్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారంతో సహ డబ్బులను కూడా కోల్పోవడం జరుగుతుందన్నారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సి ఈ ఐ ఆర్ పోర్టల్ https://www.ceir.gov.in నందు బ్లాక్ చేసి, సంబంధిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లా ప్రజలకు ఉద్దేశించి మాట్లాడుతు ఎవరైనా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ లను కొనుగోలు చేసినట్లైతే అట్టి షాప్ యజమాని నుండి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సెల్ ఫోన్ దొంగలు దొంగిలించిన ఫోన్ లను మొబైల్ షాప్ లలో అమ్ముతున్నారని, తక్కువ ధరకు వస్తుందని దొంగిలించబడిన ఫోన్ అని తెలియక కొనుగోలు చేసి అమాయక ప్రజలు మోసాలకు గురవుతున్నారన్నారు. ఎవరైనా దొంగిలించబడిన ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేసినట్లైతే అట్టి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా జిల్లాలో పోయిన మొబైల్ ఫోన్స్ రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేస్తున్న ఐ.టి కోర్ ఇన్స్పెక్టర్ రవీందర్, ఐటి కోర్ టీమ్ ను జిల్లా ఎస్పీ అభినందిం చారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ లను జిల్లా పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ రికవరీ చేసి అందించినందుకు బాధితులు జిల్లా ఎస్పీ కి, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటి కోర్ ఇన్స్పెక్టర్ రవీందర్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఆసిఫాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, వాంకిడి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



## బాసర త్రిబుల్ ఐటీ డిఎస్పిగా పి.సాయికిరణ్

బాసర, మార్చ్ 25 (జనం సాక్షి) నిర్మల్ జిల్లా బాసర లోని త్రిబుల్ ఐటీ లో డీఎస్పీగా పి. సాయి కిరణ్ ఐపీఎస్ బాధ్యతలను చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గారి ఆదేశాలు అలాగే నిర్మల్ జిల్లా ఎస్పీ కార్యాలయం మేరకు, భైంసా ఎస్డిపిఓ ఇంచార్జ్ గా బుధవారం బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ లో డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ అలాగే విద్యార్థులు, సిబ్బందికి భద్రత కల్పించడం, యూనివర్సిటీ పరిపాలనతో సమన్వయం చేసుకుంటూ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. అదేవిధంగా యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థులు, విద్యార్థులు, సిబ్బంది పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

## గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు పేరుతో
## గుట్టల మట్టి మాయం

**చిట్యాల, మర్చి 24 (జనం సాక్షి) :** మండలంలోని నవాబుపేట శివారులోని రెండు గుట్టల మట్టిని అక్రమంగా తరలిస్తున్న శేషారెడ్డి సత్య రెడ్డి పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సిపిఐ ఎం ఎల్ పార్టీ భూపాలపల్లి జయశంకర్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ ఇక్కడ ఉన్నటువంటి సహజ సంపదను కొల్లగొడుతూ గ్రిల్ ఫీల్డ్ హైవే రోడ్డు కు తరలిస్తున్నారని అన్నారు. మండల కేంద్రంలోని మైనింగ్, రెవెన్యూ, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా కూడా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తూ సదర్ కాంట్రాక్టర్ల పైన చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి ఇక్కడ గుట్టల మట్టిని తరలించకుండా నిలిపి వేయాలని వారు డిమాండ్ చేశారు. సహజ సంపద తరలించడం వల్ల గుట్టలు కనుమరుగై పోతాయని, భవిష్యత్తులో వర్షాలు కూడా కురువని పరిస్థితి ఉంటుందని అన్నారు.

### అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారంటూ
## పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన

- పూర్తిస్థాయిలో విచారణ చేయకుండా కేసు ఎలా పెడతారంటూ ఆగ్రహం...



**చెన్నారావుపేట, మార్చి 25 (జనంసాక్షి) :** అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసును పెట్టారంటూ చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ ఎదుట జల్లి గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మండలంలోని జల్లి గ్రామానికి చెందిన మంచాల సురేష్, దొంతర బోయిన కొమ్మాలుకు ఫిబ్రవరి 25వ తేదీన ఓ శుభకార్యం వద్ద గొడవ జరిగింది. ఈ గొడవ కారణంగా దొంతరబోయిన కొమ్మాలు, అతని ముగ్గురు కుమారులు రాజేందర్, నరేష్, సురేష్లు నలుగురు కలిసి మంచాల సురేష్ ను తీవ్రంగా కొట్టారు. ఈ నేపథ్యంలో మంచాల సురేష్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి జల్లి గ్రామానికి బుధవారం చేరుకొని పూర్తిస్థాయిలో విచారణ చేపట్టకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును దొంతరబోయిన కొమ్మాలు, అతని కుమారులు రాజేందర్, నరేష్, సురేష్ లు నలుగురిపై నమోదు చేశారని ఆందోళనకు దిగారు. సాక్షులు ఎవరూ లేకున్నా సాక్ష్యాలను పోలీసులే సృష్టించారంటూ అధికార కాంగ్రెస్ పార్టీకి కొమ్ముకాస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎసిపి రవీందర్ రెడ్డి వాహనాన్ని బయటికి వెళ్లకుండా అడ్డుకున్నారు.వెంటనే పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాట సుధాకర్, గ్రామస్తులు, మహిళలు తదితరులు, పాల్గొన్నారు.

## పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..
- ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్..



**వరంగల్ ప్రతినిధి, మార్చి 25(జనంసాక్షి):** ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం కింద గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇండ్ల రూఫ్‌టాప్‌లపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. బుధవారం వరంగల్ కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో, జిల్లాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార వాహనాన్ని కలెక్టర్ డాక్టర్ సత్య శారద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఒక కిలోవాట్ సోలార్ ప్యానెల్‌కు రూ. 30 వేలు, రెండు కిలోవాట్లకు రూ. 60 వేలు, మూడు కిలోవాట్లు మరియు అంతకంటే ఎక్కువ సామర్థ్యం గల ప్లాంట్లకు రూ. 78 వేల వరకు రాయితీ లభిస్తుందని తెలిపారు. గృహ వినియోగదారులు ఈ పథకం ద్వారా తమ విద్యుత్ అవసరాలను తీర్చుకోవడంతో పాటు, మిగిలిన విద్యుత్తును పవర్ గ్రిడ్‌కు అందజేసి అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ పథకంపై విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రచార వాహనాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. అలాగే మహిళా సమాఖ్యల ద్వారా కూడా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, టిజిరెడ్ కో జిల్లా మేనేజర్ రాజేందర్, ఫీల్డ్ ఆఫీసర్ నవీన్ కుమార్ యాదవ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టిలో మాణిక్యాలు.. ఆ విద్యార్థులు

- ప్రైవేట్ కు ధీటుగా మెరిసిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



**టేకుమట్ల మార్చి 25 (జనంసాక్షి) :** టేకుమట్ల మండలం సోమనపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం వెలువడిన టీజీసెట్ పోటీ పరీక్షలు రాసి మారేపల్లి రోహన్, జీడి దీపిక అతి పెద్ద విజయం సాధించారు అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శనిగరం రాజు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ప్రైవేటు రంగం ప్రవేశించక ముందు ఒక వెలుగు వెలిగిన ప్రభుత్వ రంగ పాఠశాలలు మీద నేడు చిన్న చూపు ఉందని, అటు ప్రభుత్వం నుండి కానీ ఇటు తల్లిదండ్రుల నుండి కానీ సరైన ఆధరణ లేక విద్యార్థులు రాక రోజుకొకటి చొప్పున ప్రభుత్వ పాఠశాలను మూత పడుతున్న నేటి కాలంలో ప్రైవేటు విద్యా సంస్థలకి కోచింగ్ సెంటర్లకు ధీటుగా సోమనపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శనిగరం రాజు, ఉపాధ్యాయురాలు బి మానస లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మారేపల్లి రోహన్ తండ్రి మారేపల్లి కృష్ణమూర్తి, జీడి దీపిక తండ్రి జీడి మహేందర్ పిల్లలను చదివించి నేడు ఈ విజయాన్నీ సాధించారు. రాబోయే రోజుల్లో చక్కటి క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రధానోపాధ్యాయులు శనిగరం రాజు అన్నారు. ఈ సందర్భంగా సోమనపల్లి గ్రామ సర్పంచ్ రామ ఉమ దేవేందర్ గ్రామ పెద్దలు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఇంతటి ఘన విజయాన్ని సాధించిన పాఠశాల ఉపాధ్యాలకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ దూడపాక తిరుమల, విద్యార్థిని విద్యార్థులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలపై పన్నుల భారం లేదు

- మేయర్ గుండు సుధారాణి
- కౌన్సిల్ సమావేశానికి హాజరైన హనుమకొండ జిల్లా కలెక్టర్, జి డబ్ల్యూఎంసి ఇన్చార్జి కమిషనర్ చాహత్ బాజ్పాయ్, కార్పొరేటర్లు
- రూ.1040.58 కోట్ల అంచనాలతో వరంగల్ బల్దియా బడ్జెట్ ఆమోదం




**వరంగల్ బ్యూరో, మార్చి 25( జనం సాక్షి) :** వరంగల్ మహా నగర పాలక సంస్థకు సంబంధించిన 2026-2027 సం.రానికిరూ.1040 కోట్ల 58 లక్షల 75 వేల అంచనాలతో మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన బుధవారం పాలక వర్గం ఆమోదించింది. బల్దియా అకౌంట్స్ అధికారి శివ లింగం బడ్జెట్ అంచనాలను వెల్లడించగా మెజారిటి సభ్యులు అంగీకారం తెలపడంతో పాలక వర్గం బడ్జెట్ ను ఆమోదించింది.రూ.1040 కోట్ల 58 లక్షల 75 వేల అంచనాలతో బడ్జెట్ రూపొందించారు.ఇందులో రూ.349 కోట్ల 19 లక్షలు సాధారణ పన్నుల ద్వారా, రూ.685 కోట్ల 20 లక్షలు వివిధ గ్రాంట్ల ద్వారా, రూ 620 కోట్లు డిపాజిట్లు, అడ్వాన్సులద్వారాసమకూరుతుందని అంచనా వేశారు.హన్మకొండ జిల్లా కలెక్టర్, జిడబ్ల్యూఎంసి ఇంచార్జి కమిషనర్ చాహత్ బాజ్ పాయి, డెప్యూటీ మేయర్ రిజ్వాన శమిమ్ మసూద్, కార్పొరేటర్లు, బల్దియా వింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలపై పన్నుల భారం లేదు

ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ, చివరి బడ్జెట్ సమావేశంలో సుమారు రూ. 1,040 కోట్ల 58 లక్షల 75 వేల అంచనాలతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. సామాన్య ప్రజలపై ఎలాంటి పన్నుల భారం లేకుండా, పేద మరియు మధ్యతరగతి వర్గాలకు అనుకూలంగా బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు.కౌన్సిల్ సభ్యుల ఆమోదంతో బడ్జెట్‌ను సానుకూలంగా తీర్మానించి ఆమోదించామని వెల్లడించారు. ప్రస్తుతం జీడబ్ల్యూఎంసీకి సాధారణ పన్నుల ద్వారా రూ. 349 కోట్ల 19 లక్షల ఆదాయం వస్తోందని, వివిధ గ్రాంట్ల ద్వారా రూ. 685 కోట్ల 28 లక్షలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. అదనంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులు మరియు ఫిఫ్టీన్ ఫైనాన్స్ కింద వచ్చిన నిధులతో కలిపి మొత్తం సుమారు రూ. 1,080 కోట్ల బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వరంగల్‌ను అభివృద్ధి పథంలో నడిపించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. హైదరాబాద్ తరువాత రెండవ అతిపెద్ద మహానగరంగా వరంగల్‌ను తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపుతున్నారని అన్నారు.

## ఈ నెల 28న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి




**దేవరకొండ, మార్చి 25 (జనంసాక్షి) :** దేవరకొండ కోర్టు ఆవరణలో ఈ నెల 28న జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ సీనియర్ సివిల్ జడ్జి కమ్,మండల న్యాయ సేవ సంస్థ అధికారి సంస్థ చైర్ పర్సన్ కే.అనిత అన్నారు. బుధవారం తన కార్యాలయంలో పోలీస్, మున్సిపల్, బిఎస్ఎన్ఎల్, బ్యాంకింగ్, శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన, ఇరువైపులా సమ్మతితో సమస్యలను పరిష్కరించుకునే అవకాశం అందుబాటులో ఉందన్నారు. రాజీ చేసుకునే అవకాశమున్న వివిధ రకాల క్రిమినల్, కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితం, కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు, డ్రంకన్ డ్రైవ్, మోటారు వాహన చట్టం ఉల్లంఘనలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంక్ రికవరీ, విద్యుత్ చౌర్యం తదితర కేసులు పరిష్కరించుకోవచ్చని వెల్లడించారు. కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని సూచించారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. ఏ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ పి. స్నేహ, డీఎస్పీ శ్రీనివాస్ రావు, ఏ పి పి లు, బార్ అధ్యక్షులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు,అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**రామన్నపేట, మార్చి 25 (జనంసాక్షి) :** రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని యాదాద్రి భువనగిరి అదనపు కలెక్టర్ భాస్కరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పరిసరాలను పరిశీలించి శానిటేషన్ కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి నిర్వహణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో దవాఖాన సూపరింటెండెంట్ సూచనలతో పనులు చేపట్టాలని ఆదేశించారు. సిబ్బందిని నియమించి పూర్తి స్థాయిలో పనులు చేపట్టకపోతే షోకాజ్ నోటీసులు జారిచేసి కాంట్రాక్ట్ లైసెన్స్ ను బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు.వైద్యులు, వైద్య సిబ్బంది డిప్యూటేషన్లను రద్దు చేయాలని డీసీహెచ్ఎస్ ను ఫోన్‌లో ఆదేశించారు. దవాఖాన ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను, డ్రైనేజీ నిర్మాణ పనులను చేయించాలని ఎంపీడీఓ ఆవుల రాములును ఆదేశించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ట్యాక్స్ కలెక్షన్ ఇతర రికార్డులు సరిగ్గా నమోదు చేయక పోవడంతో చర్యలు తీసుకోవాలని డీపీఓను ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం పల్లె ప్రకృతివనం, నర్సరీలను పరిశీలించారు. పల్లె ప్రకృతివనంలో చెట్లను తీసివేయడంపై తాసీల్దార్ లాల్ బహదూర్ ను విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట దవాఖాన సూపరింటెండెంట్ శ్వేత ప్రియాంక, ఏపీఓ వెంకన్న, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్



**తెలకపల్లి, మార్చి 25 (జనం సాక్షి) :** ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ జి.వి.శ్యాం ప్రసాద్ లాల్ అన్నారు బుధవారం మండల కేంద్రానికి చేరుకున్న వారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పాఠశాల నిర్వహణను పరిశీలించారు.పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ రాబోయే ఏడు సంవత్సరాలు ఏకాగ్రతతో చదువుపై దృష్టి నిలవాలని డ్రగ్స్ ,గంజాయి వంటి దురలవాట్లకు లోన్ కావద్దని ,బాలికలు చక్కగా చదువుకోవాలని బాల్య వివాహాలు చేసుకోకుండా తల్లిదండ్రులను ఒప్పించి ఉన్నత చదువులు చదువుకోవాలని సూచించారు. ఏకలవ్యుని కథను వివరిస్తూ మీరు పదవ తరగతి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావడమే మీ గురువులకు ఇచ్చే కానుక అని విద్యార్థులను కోరినారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారము వంట చేసినారా లేదా అని పరిశీలించారు. తర్వాత విద్యార్థులతో కలిసి భోజనం చేయడం జరిగింది. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఈ పాఠశాల విద్యార్థులందరూ మీ పిల్లలుగా భావించి చక్కని విద్యను అందించాలని ఏ రకమైన వివాదాలు లేకుండా పాఠశాలను ఉత్తమంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు, పాఠశాల ఉపాధ్యాయులు ఎం ఆర్ సి సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన

- త్రాగునీటి సరఫరా, ఇండ్ల నిర్మాణం, భూముల రీ సర్వేపై సమీక్ష



**నూతనకల్, మార్చి 25 (జనంసాక్షి) :** జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్ నూతనకల్ మండలంలో బుధవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరా ప్లాంట్‌ను సందర్శించి ఐదు మండలాల పరిధిలోని అన్ని ఆవాస ప్రాంతాలకు త్రాగునీరు నిరంతరంగా అందేలా తగు చర్యలు తీసుకోవాలని వేసవి కాలంలో మంచినీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం చిల్పకుంట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పనులను దశలవారీగా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు బిల్లులను ఎప్పటికప్పుడు మంజూరు చేయాలని సంబంధిత హౌసింగ్ అధికారులను ఆదేశించారు. తదుపరి గుండ్ల సింగారం గ్రామంలో భూముల రీ సర్వే ప్రక్రియను పరిశీలించి జిల్లా సర్వే అధికారులతో చర్చించారు సర్వే పనులను త్వరగా పూర్తి చేసి రైతులు,ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ కరుణాకర్ రెడ్డి, డీఈ రమేష్ కుమార్, డిఎల్పిఓ నారాయణరెడ్డి,తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత,ఏఈ గ్రిడ్, ఆర్ఈడబ్ల్యూ అధికారి అశోక్,సర్పంచ్ అంజపెల్లి నరసమ్మ, ఆర్ఐ హసన్ అలీ, ఎంపీఓ శశికళ, కార్యదర్శి గంగరాజు,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 25 (జనంసాక్షి) :** రానున్న వేసవి కాలంలో గ్రామాలలో నీటి ఎద్దడి సమస్య రాకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లో వేసవి కాలంలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా నివారణ చర్యలపై డిఆర్డిఓ, డిపిఓ, మిషన్ భగీరథ, ఆర్ డబ్ల్యూఎస్, మండల ప్రజా పరిషత్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వేబెక్స్ కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం గ్రామాలలో నీటి సమస్య లేకుండా అధికారులు కష్టపడి పని చేశారని అన్నారు.అదే విధంగా ఈ సంవత్సరం కూడా వేసవిలో గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా ప్రతి ఇంటికి సక్రమంగా నీటి సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఉన్న 9 వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ల నుండి 818 అవాసాలకు నీటి సరఫరా చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ అధికారుల నివేదికల ప్రకారం గ్రీన్, ఎల్లో, ఆరెంజ్, రెడ్ కేటగిరీలుగా విభజించి నీటి సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు.గ్రీన్ కేటగిరీలో రోజుకు ఒక్కో మనిషికి 100 లీటర్లు చొప్పున 692 అవాసాలకు, ఆరెంజ్ కేటగిరీలో రోజుకు 80 లీటర్ల చొప్పున 107 అవాసాలకు, ఎల్లో కేటగిరీలో రోజుకు 21 నుండి 55 లీటర్ల చొప్పున 11 అవాసాలకు, రెడ్ కేటగిరీ కింద 08 అవాసాలు ఉన్నాయని తెలిపారు. ఆరెంజ్, ఎల్లో, రెడ్ కేటగిరీలో ఉన్న అవాసాలను గ్రీన్ కేటగిరీలోకి మార్చేందుకు రూరల్ వాటర్ సప్లయ్, మిషన్ గ్రిడ్ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆరెంజ్, ఎల్లో, రెడ్ కేటగిరీలో ఉన్నా ఆవాసాల జాబితాను అన్ని మండలాలకు పంపించి నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ మంచినీటి సరఫరా సజావుగా జరిగేలా సంబందిత శాఖ అధికారులు మండల, గ్రామాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. శనివారం వరకు అన్ని మండలాలలో 2026-27కు సంబందించిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ తో పాటు ప్రత్యమ్నాయ చర్యలపై ప్రణాళికలు సిద్దంగా ఉండాలన్నారు. పంపులు, పైప్ లైన్ లీకేజీలు, ఓహెచ్ ఆర్ లలో లీకేజీలను గుర్తించడం జరిగిందని తెలిపారు. అధికారులు ప్రయారిటీ కింద మోటర్ల రిపేర్లు, హ్యాండ్ పంపుల రిపేర్లు చేయించాలని, గ్రామ పంచాయితీ ట్రాక్టర్లు, ట్యాంకర్లు పని చేయాలని పేర్కొన్నారు.ఒకవేళ ఎక్కడైనా సరఫరా సమస్య తలెత్తినప్పుడు గ్రామ పంచాయితీ ట్యాంకర్ల ద్వారా మంచి నీటి సరఫరా చూసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయితీ స్థాయిలో క్లోరినైజేషన్ కోసం బ్లీచింగ్ పౌడర్ అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయితీకి మంచినీటి సహాయకుడిని నియమించి వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందని వారు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఒక్కరోజు కూడా గ్రామాలకు మంచినీటి సరఫరా ఆగేది లేదని, ఇందుకోసం అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జడ్పీ సీఈవో శిరీష, డిపిఓ యాదగిరి, మిషన్ భగీరథ ఈఈ కరుణాకర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాసరావు, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రమయే విజయానికి మార్గం

- జిల్లా ఎస్పీ కె.నరసింహా




**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 25 (జనంసాక్షి) :** విజయానికి అడ్డదారులు ఉండవని, విజయం సాధించాలంటే శ్రమయే మార్గమని, విద్యార్థులు నిత్యం శ్రమించాలని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని రవి మహల్ లో డ్రీమ్స్ 2026 పేరిట జరిగిన స్పందన డిగ్రీ అండ్ పీజీ కళాశాల వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ఎంచుకున్న లక్ష్యం సాధించడానికి మంచి ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, అంశాలపై విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలని సూచించారు.గొప్ప విజయాలు సాధించిన వారి విజయగాథలను ఆదర్శంగా తీసుకోవాలని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితాన్ని ఉద్దేశించి వివరించారు.మంచి భవిష్యత్తుపై యువత కలలు కనాలని, ఆ కలలను సాకారం చేయడం కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. కష్టపడి చదువుకునే సమయంలో యువత ఆకర్షణలకు గురై బంగారు భవిష్యత్తును కోల్పోవద్దని, చెడు అలవాట్లకు లోనూ కావద్దని పేర్కొన్నారు. శ్రమతో వచ్చే ఫలితం తృప్తినిస్తుందని, మంచి భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని అన్నారు.సరైన సమయంలో కష్టపడే వారు ఉన్నత స్థానాలకు చేరుతారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ తీకుళ్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ బాల్తు సైదారావు, డైరెక్టర్లు వాసుదేవరావు, వేణుగోపాలరావు, పులి అచ్యుతరామశర్మ, శ్రీనివాసరెడ్డి,నాగిరెడ్డి, వివిధ కళాశాల యాజమాన్యాలు మారం వెంకటరెడ్డి, యాదవ రెడ్డి, సత్యంబాబు, భగవాన్ రెడ్డి,బాల గౌడ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పథకాల లక్ష్యాలు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్




**నల్లగొండ ప్రతినిధి, మార్చి 25 (జనం సాక్షి) :** ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన్య పథకాల లక్ష్యాలను బ్యాంకర్లు నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు.కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సెప్టెంబర్, డిసెంబర్ త్రైమాసిక లక్ష్యాల సాధనపై బ్యాంకుల నియంత్రణ అధికారులు, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం బ్యాంకుల సహకారంతో పలు పథకాలు అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ రుణాలు, చిన్న మరియు మధ్య తరహా వ్యాపారులకు రుణాలు, టర్మ్ లోన్లు, డీఆర్‌డీఏ, మెప్మా, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా అందించే రుణాల గ్రౌండింగ్‌లో నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలని బ్యాంకర్లకు సూచించారు.గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ద్వారా శిక్షణ పొందిన పేదలు చేసిన రుణ దరఖాస్తులను ఆలస్యం చేయకుండా మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ బ్యాంకుల పనితీరుపై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించగా, శాఖల అధికారులు తమ తమ పథకాల పురోగతి, పెండింగ్ అంశాలను వివరించారు.ఇక 2026-27 ఆర్థిక సంవత్సరానికి నాబార్డ్ రూపొందించిన రూ.16,861 కోట్ల సామర్థ్య ఆధారిత రుణ ప్రణాళిక (పీఎల్‌పీ)ను కలెక్టర్ ఆవిష్కరించారు.సమావేశానికి ఆర్బీఐ ఎల్డిఓ గోమతి, నాబార్డ్ డిడిఎమ్ వినయ్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈఓ శంకర్ రావు, సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకర్ల ప్రతినిధులు హాజరయ్యారు.

## వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే ముఠా గోపాల్
- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు



**ముషీరాబాద్, మార్చి 25 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో అమలు సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద వికలాంగుల రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ,ఎమ్మెల్యే ముఠా గోపాల్, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి, బిజెపి దివ్యాంగుల సెల్ స్టేట్ కన్వీనర్ కొల్లి నాగేశ్వరరావు, వికలాంగుల సంఘం రాష్ట్ర నాయకులు మహమ్మద్ మున్నా, పలువురు నాయకులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. బ్యాక్ లాగ్ ఉద్యోగాలతో సహా ప్రభుత్వంలోని అన్ని శాఖలు సంస్థలో వికలాంగుల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. వికలాంగులకు అన్ని రకాల ఆర్టీసీ బస్సులతో సహా, హైదరాబాద్ మెట్రో రైల్ లో కూడా ఉచిత రవాణా కల్పించాలన్నారు. ప్రభుత్వ జీవో ఉత్తర్వుల ప్రకారం వికలాంగుల ప్రత్యేక శాఖ రాష్ట్ర విభజనకు ముందు ఎలా అయితే ఉందో అదేవిధంగా పునరుద్ధరించి అన్ని స్థాయిలో సిబ్బంది నియమించి కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. వికలాంగుల సామాజిక పెన్షన్ల పెంపుతోపాటుగా అర్హులైన పెన్షన్ దారులు అందరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ నాగభూషణం, నల్లగొండ శ్రీను,ఎం నరసింహ, ప్రసాద్, నయ్యాం , మల్లేష్ ,సైదులు, రామచందర్, రాజ్యలక్ష్మి, వెంకట్ రెడ్డి, గిద్దె రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోచంపల్లి చేనేత టూరిజం అభివృద్ధికి విస్తృత అవకాశాలు

**భూదాన్ పోచంపల్లి, మార్చి 25 (జనం సాక్షి) :** పోచంపల్లి చేనేతకు ఉన్న దేశవ్యాప్త గుర్తింపుతో ఈ ప్రాంతాన్ని చేనేత టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం భూదాన్ పోచంపల్లి మండలంలోని టూరిజం పార్క్, చేనేత కార్మికుల ఇండ్లను పరిశీలించారు. పోచంపల్లి చెరువు మినీ ట్యాంక్‌బండ్ పనులను సమీక్షించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చేనేత సహకార సంఘాన్ని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. టూరిజం చేనేత రంగాలను అనుసంధానించి మార్కెటింగ్ సదుపాయాలు పెంచాలని సూచించారు. జాలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థలో విద్యార్థులకు అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకొని శిక్షణను సమర్థవంతంగా వినియోగించుకుని ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అర్బన్ ఫారెస్ట్ పార్క్, లేక్ వ్యూ పార్క్‌లను పరిశీలించారు. అనంతరం శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అయ్యప్పభక్త సమాజం ట్రస్ట్ ఆధ్వర్యంలో శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత శాఖ ఏ.డి ఎ.శ్రీనివాస రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి,



జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో భాస్కర్, మున్సిపల్ కమీషనర్ అంజన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, భారత లవకుమార్, అయ్యప్పభక్త సమాజం ట్రస్ట్ అధ్యక్షులు రాపోలు రామచంద్రం, ఎన్నశీ శివ కుమార్, రాపోలు జ్ఞానేశ్వర్, తండ వెంకటేష్, గంగపురం వెంకటేష్, శెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 25 (జనంసాక్షి) :** జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ లో జిల్లా స్థాయి శాండ్ కమిటీ సమావేశంలో వెబెక్స్ ద్వారా జిల్లా ఎస్పీ కె.నరసింహాతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఆరు ఇసుక రిచ్ లలో ఇసుక అక్రమ రవాణా వాహనాలు పట్టుబడితే బైండవర్ కేసులు నమోదు చేసి జరిమానా విధించాలని ఆదేశించారు.ప్రతి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో ఇసుక అందించుటగాను ఆన్ లైన్ లో నమోదు చేపించాలని,ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక కొరత రాకుండా చూడాలని సూచించారు.జిల్లాలో ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి పోలీస్, రెవిన్యూ, మైనింగ్ వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఒక మొబైల్ టీంను ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ టీమ్ జిల్లాలోని ఇసుక రిచ్ లో పర్యటిస్తూ అక్రమ ఇసుక రవాణాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లాలో 729 ఆమోదం పొందిన ఇసుక ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించాలని పేర్కొన్నారు. సీసీ, ఏఎన్పిఆర్ కెమెరా పర్యవేక్షణతో పాటు ప్రతి సాండ్ టాక్సీ రీచ్‌లో 24 గంటల పర్యవేక్షణ కోసం హైఎండ్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఏదైనా అనధికార వాహనం కెమెరాలో గుర్తిస్తే ఆ వాహనాన్ని బ్లాక్ చేయబడుతుందని అన్నారు. సీసీ కెమెరాతో అమర్చబడిన మొబైల్ వాహనం ద్వారా రీచ్ పరిసర ప్రాంతాలలో నిరంతరం సంచరిస్తూ అక్రమ ఇసుక రవాణాను తక్షణమే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు.తహసీల్దార్లు వారానికి కనీసం రెండు సార్లు రీచ్‌లను తప్పనిసరిగా సందర్శించాలని అన్నారు.ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1 నుండి ఇసుక సరఫరాకు మ్యాన్యువల్ ఉండదని, ఆన్ లైన్ ట్రాన్సిస్ట్ పాస్ సిస్టమ్, మన ఇసుక వాహనం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.గ్రామపంచాయతీ సెక్రటరీ ఇసుక ఎంత కావాలో నిర్ధారిస్తే, సంబంధిత తహసిల్దార్ పర్యవేక్షణలో ఆన్లైన్ ద్వారా నమోదు చేస్తారని వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, రెవెన్యూ డివిజనల్ అధికారి వేణు మాధవరావు, మైనింగ్ ఏడి విజయ రామారావు, డిపిఓ యాదగిరి, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి బాలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# రెండో రోజూ లాభాల్లో..

## సెన్సెక్స్ 1200 పాయింట్లు జంప్

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో యుద్ధం ముగింపు దిశగా సంకేతాలు, చమురు ధరలు తగ్గడం వంటి పరిణామాలు పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమయ్యాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్ కూడా రాణించింది. దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ లాభపడ్డాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.8 లక్షల కోట్లు పెరిగి రూ.431 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 74,652.01 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,068.45) లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 75,849.76 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1205 పాయింట్ల లాభంతో 75,273.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 394.05 పాయింట్ల లాభంతో 23,306.45 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 93.96గా ఉంది. సెన్సెక్స్-30 సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ, టైటాన్, ఇండిగో కంపెనీల షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టీసీఎస్, బీఈఎల్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 99 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



### బంగారానికి మళ్లీ గిరాకీ..

అటు తాజా పరిణామాలతో బంగారం ధరకు మళ్లీ రెక్కలొచ్చాయి. బుధవారం అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సుధర 4,554 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. అటు ఔన్సు వెండి ధర 72 డాలర్లకు పైనే కొనసాగుతోంది. అంతర్జాతీయ ధరలను అనుసరించి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో (బుధవారం సాయంత్రం 4 గంటలకు) 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల బంగారం ధర దాదాపు రూ.1.50 లక్షల వద్ద కొనసాగుతోంది. కిలో వెండి ధర రూ.2.40 లక్షలు పలుకుతోంది.

## రూ.28,840 కోట్లతో ఉడాన్ స్కీమ్

### 100 విమానాశ్రయాల అభివృద్ధి..

న్యూఢిల్లీ: దేశంలో చిన్న నగరాలకూ విమాన సర్వీసులు అందుబాటులోకి తెచ్చేందుకు అమలు చేస్తున్న ప్రాంతీయ అనుసంధానత పథకాన్ని (ఉడాన్) కేంద్ర ప్రభుత్వం సవరించింది. ఇప్పటికే అమల్లో ఉన్న పథకానికి మరిన్ని మెరుగులు దిద్దుతూ మాడిఫైడ్ ఉడాన్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ ఈ పథకానికి ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.28,840 కోట్లు కేటాయించారు. 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2035-36 వరకు అంటే పదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. ఈ స్కీమ్ కింద ప్రస్తుతం వినియోగంలో లేని 100 విమానాశ్రయాలను కొత్తగా అభివృద్ధి చేయనున్నారు. దీని కోసం రూ.12,159 కోట్లు కేటాయించారు. కొత్తగా అభివృద్ధి చేసిన విమానాశ్రయాల నిర్వహణ కోసం మూడేళ్ల పాటు ఆర్థిక సాయం అందిస్తారు. దీంతోపాటు కొండ, మారుమూల ప్రాంతాలు, ద్వీపాలకు కనెక్టివిటీని పెంచడానికి 200 ఆధునిక హెలిప్యాడ్లను నిర్మిస్తారు. సామాన్యులకు విమాన ప్రయాణం అందుబాటులోకి (తక్కువ ధరలో) తీసుకొచ్చేందుకు విమానయాన సంస్థలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ అందిస్తారు. ఇందుకోసం రాబోయే 10 ఏళ్ల కోసం దీని కింద రూ.10,043 కోట్లు వెచ్చించనున్నారు. 'ఆత్మనిర్భర్ భారత్'లో పవన్ హ్యాన్స్ కోసం హెచ్ఏఎల్ ధ్రువ్ హెలికాప్టర్లు, అలయన్స్ ఎయిర్ కోసం రెండు హెచ్ఏఎల్ డోర్నియర్ విమానాలను కొనుగోలు చేస్తారు. ఉడాన్ పథకాన్ని 2016లో తొలిసారి ప్రారంభించారు. విమాన ప్రయాణాన్ని సామాన్యులకూ అందుబాటు ధరల్లో అందించడం దీని ముఖ్య ఉద్దేశం. విమాన సేవలు అందుబాటులోకి లేని ప్రాంతాలకు కనెక్టివిటీని పెంచడం, టైర్-2, టైర్-3 నగరాల్లో వాణిజ్యం, పర్యాటకాన్ని మెరుగుపరిచి వాటిని ఆర్థికంగా బలోపేతం చేయడం సవరించిన పథకం ముఖ్య ఉద్దేశం. అందుబాటు ధరలో విమాన ప్రయాణాన్ని అందించంతో పాటు మారుమూల, కొండ ప్రాంతాలకు సైతం అత్యవసర సేవలందేలా చొరవ తీసుకోవడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. వికసిత్ భారత్- 2047 లక్ష్యాలను చేరుకోవడంతో పాటు, విమానయాన రంగంలో ఆత్మనిర్భర్ భారత్‌ను సాధించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని వివరించారు.




## ఫార్ములా స్టైల్ కార్..

### 2.8 సెకన్లలో 0-96 కి.మీ వేగం!

వాషింగ్టన్: అమెరికా స్టార్టప్ కంపెనీ రైన్ మోటర్స్ ఆటోమొబైల్ రంగంలో వినూత్న డిజైన్‌తో ఓ కారును విడుదల చేసింది. ఫార్ములా- 1 రేసింగ్ కారు తరహాలో ఎఫ్‌పీ3 అనే కారును విడుదల చేసింది. అమెరికా రిజిస్ట్రేషన్ నిబంధనలను అనుసరించి త్రీవీలర్‌గా వస్తోంది. అవసరాన్ని బట్టి 4 వీలర్‌గా కన్వర్ట్ చేసుకోవచ్చని కంపెనీ చెబుతోంది. ఇందులో సుజుకీ హయబుసా 1,340 సీసీ ఫోర్ సిలిండర్ ఇంజిన్ అమర్చారు. ఇది 10,500 తీజూఎ వద్ద 210 ష్ట్రజూ, 9,800 తీజూఎ వద్ద 163 ఔఎ టార్క్‌ను విడుదల చేస్తుంది. సిక్స్ స్పీడ్ ట్రాన్స్‌మిషన్‌తో వస్తోంది. దీని బరువు 517 కేజీలు. ఫైబర్‌గ్లాస్ బాడీతో వస్తోంది. ఇది 2.8 సెకన్లలోనే 0-96 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఎఫ్‌పీ3 బేస్ మోడల్ 78,499 డాలర్లుగా కంపెనీ నిర్ణయించింది. అంటే దేశీయ కరెన్సీ ప్రకారం రూ.73.72 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. టర్బో ఛార్జింగ్ మోడల్ ధర లక్ష డాలర్లుగా కంపెనీ నిర్ణయించింది. అంటే దీని ధర రూ.95.32 లక్షలుగా ఉంటుంది. ఎర్లీ యాక్సెస్ డెలివరీలను ఈ ఏడాది నవంబరులో, వచ్చే ఏడాది లాంచ్ ఎడిషన్‌ను తీసుకొస్తారు.







## సోరా వీడియో జనరేటింగ్ యాప్ మూసివేత

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత టెక్ట్స్-టు- వీడియో జనరేటింగ్ యాప్ సోరాను చాట్‌జీపీటీ మాతృ సంస్థ ఓపెన్‌ఏఐ గతేడాది ప్రారభించిన విషయం తెలిసిందే. యూజర్ ప్రాంప్ట్‌ను కచ్చితంగా పాటిస్తూ, దృశ్య నాణ్యతలో రాజీ పడకుండా నిమిషం నిడివి వీడియోలను సృష్టిస్తూ.. విడుదలైన కొద్దికాలానికే ఐఫోన్ యాప్ స్టోర్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. తాజాగా ఆ యాప్‌ను మూసివేస్తున్నట్లు ఓపెన్ ఏఐ ప్రకటించింది. ఇతర పరిశోధనలపై దృష్టిసారించడానికే ఈ ప్రత్యేక యాప్‌ను మూసివేస్తున్నట్లు తెలిపింది. రోజురోజుకు ఏఐ మోడళ్లకు డిమాండ్ పెరుగుతుండడంతో.. నిజ జీవితంలో భౌతిక పనులు చేసుకోవడానికి ప్రజలకు సహాయపడే రోబోటిక్స్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నట్లు కంపెనీ పేర్కొంది. ఇప్పటి వరకు సోరా యాప్ కోసం పనిచేసిన తమ పరిశోధన బృందం ఇకపై రోబోటిక్స్ తయారీకి పనిచేస్తుందని ఓపెన్‌ఏఐ తెలిపింది. యాప్ యూజర్ల డేటాకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భద్రపరచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది.


ఏసీల ధరలు 8% పెరుగుతాయ్

ఓపెన్ ఏఐ నిర్ణయంపై ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ దిగ్గజం వాల్ట్ డిస్నీ స్పందించింది. వీడియో జనరేషన్ వ్యాపారం నుంచి వైదొలిగి, తమ ప్రాధాన్యతలను వేరే చోటికి మార్చుకోవాలనే ఆ సంస్థ నిర్ణయాన్ని తాము గౌరవిస్తున్నామని తెలిపింది. అభిమానులకు మరింత చేరువయ్యేందుకు ఏఐ ప్లాట్‌ఫాంతో కలిసి పని చేస్తామంది. డిసెంబర్ 2025లో ఓపెన్‌ఏఐ, డిస్నీతో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. దానిప్రకారం.. సోరా 200కు పైగా డిస్నీ, మార్వెల్, పిక్సార్, స్టార్ వార్స్ పాత్రలను ఉపయోగించి, అభిమానులు చూడటానికి, షేర్ చేయడానికి వీలుగా, వినియోగదారులు కోరిన మేరకు చిన్న సోషల్ వీడియోలను రూపొందిస్తుంది. ప్రస్తుతం ఈ యాప్‌ను మూసివేస్తుండడంతో డిస్నీతో చేసుకున్న ఒప్పందం కూడా ముగిసే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.







# హర్మూజ్‌తో అంత ఈజీకాదు..!

## జలసంధిని మూయలేరు.. తెరవలేరు • అమలులో కీలక అంతర్జాతీయ చట్టాలు

న్యూఢిల్లీ: హర్మూజ్ జలసంధిని 48 గంటల్లో తెరవకుంటే తీవ్రమైన దాడులు చేస్తామని అమెరికా, అలా చేస్తే గల్ఫ్‌లోని అమెరికా మిత్రదేశాల జీవనాడు లను దెబ్బతీస్తామని ఇరాన్ పరస్పర వాగ్బాణాలతో పశ్చిమాసియా యుద్ధాన్ని వేడెక్కించాయి. ఇంతకూ హర్మూజ్‌ను పూర్తిగా మూసేసే అధికారం ఇరాన్‌కుందా? దాన్ని సైనిక బలగాలతో అమెరికా తెరిపించగలుగుతుందా? హర్మూజ్‌లాంటి కీలకమైన జలసంధుల్లో రవాణాపై అంతర్జాతీయ చట్టాలేం చెబుతున్నాయి? హర్మూజ్‌లాంటి జల సంధుల నిర్వహణ శాంతికాలంలో అంతర్జాతీయ నిబంధనల (సముద్ర చట్టాలపై ఐక్యరాజ్యసమితి నియమాలు- యూఎన్‌సీఎల్ఓఎస్) మేరకు సాగుతుంటుంది. అదే యుద్ధసమయంలో సాన్ రెమో నిబంధనలను అనుసరిస్తారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన ప్రాంతాల్లో నౌకరవాణా సజావుగా కొనసాగటమే ఈ నిబంధనల ముఖ్యోద్దేశం.

### శాంతికాలంలో..

రోజూ 20% ప్రపంచ చమురు రవాణా చేసే హర్మూజ్ జలసంధినే తీసుకుంటే... ఇది పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లను కలుపుతుంది. తీరప్రాం తాలైన ఇరాన్, ఒమన్‌లకు దీనిపై ప్రాదేశిక సార్వభౌమాధికారం ఉన్నా అంతర్జాతీయ జలసంధి ఇది. అందుకే ఇతర దేశాల నౌకలన్నింటికీ కూడా దీని ద్వారా వెళ్లే రవాణా హక్కుంటుంది. నిరంతరం సాగే నౌకలను శాంతికాలంలో ఈ దేశాలు అడ్డుకోకూడదు.

### యుద్ధ సమయంలో...

అదే యుద్ధంగానీ, ఆయుధ సంక్షోభాల సమయంలోగానీ పైన చెప్పిన నిబంధనలు వర్తించవు. నావికాదళ యుద్ధ చట్టాలు అమల్లోకి వస్తాయి. సాధారణంగా ఆయా దేశాలన్నీ 1994 సాన్ రెమో నిబంధనల ప్రకారం నడుచుకుంటాయి. దీని ప్రకారం దేశాలను- యుద్ధంలో భాగమైనవి, యుద్ధంతో సంబంధం లేని తటస్థ దేశాలుగా విభజించి చూస్తారు. తటస్థ దేశాల వాణిజ్య నౌకలు, యుద్ధనౌకలు జలసంధి ద్వారా వెళ్లవచ్చు. వాటిని యుద్ధంలో భాగస్వాములైన దేశాలు ఆపకూడదు. లక్ష్యంగా చేసుకోకూడదు. తటస్థ దేశాలకున్న చట్టబద్ధమైన హక్కులను గౌరవించాలి. అయితే యుద్ధంలో భాగమైన దేశాలతో జలసంధికి బంధం (ప్రస్తుతం ఇరాన్-హర్మూజ్‌లా) ఉంటే కొన్ని నియంత్రణలు విధించుకోవచ్చు. తమ జలసంధి ద్వారా వెళ్లే నౌక శత్రుదేశానిదిగానీ, శత్రుదేశానికి సాయం చేసేదనిగానీ భావిస్తే వాటిని తనిఖీ చేసే, అనుమతి నిరాకరించే, దాడి చేసే హక్కు ఆ దేశానికి ఉంటుంది. అంతేగాని జలసంధిని పూర్తిగా మూసేసే అధికారం ఉండదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్‌కు తమపై యుద్ధం చేస్తున్న అమెరికా, ఇజ్రాయెల్‌తో పాటు వాటి మిత్రదేశాల నౌకలనూ హర్మూజ్‌లో ఆపే అధికారం ఉంది. తటస్థ దేశాల నౌకలను మాత్రం ఆపకూడదు.

### అలాగైతే దాడే!

వాణిజ్య నౌకలకు రక్షణగా సైనిక నౌకలను పంపటం సహజమే! అయితే అలా తోడు వచ్చేవి తమ శత్రుదేశానికి చెందినవైతే మాత్రం దాడులకు అవకాశం ఉంటుంది. కార్గో నౌకలకు రక్షణగా తమ సైనిక నౌకలను దించుతామంటూ ట్రంప్ ప్రకటన చేస్తున్న నేపథ్యంలో ఇది కీలకం! ఇలాంటి నౌకలపై దాడి చేసే అధికారం ఇరాన్‌కు ఉంటుంది. తటస్థ దేశాల కార్గో నౌకలకు వాటి రక్షణ నౌకలు తోడు వస్తే ఇరాన్ అనుమతించాల్సిందే. అయితే... ఆ దేశాలు ఇరాన్‌కు తమ సమాచారాన్ని ముందుగా తెలియజేయాలి. తనిఖీలకు సహకరించాలి.


### నిజాయతీగా లేకుంటే

# వలసదారులు ఇంటికే..!



న్యూఢిల్లీ: వలసదారులను నియంత్రించేందుకు స్వీడన్ ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. నిజాయతీతో కూడిన జీవన ప్రమాణాలు పాటించని వలసదారులను వెనక్కి పంపించేలా కొత్త చట్టాన్ని తీసుకొచ్చేందుకు ప్రతిపాదన చేసింది. ఆ దేశ పార్లమెంట్‌లో ఆమోదం పొందితే ఈ జులై 13 నుంచి అమల్లోకి రానుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో స్వీడన్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం పలు సంస్కరణలకు ఉపక్రమించింది. రుణాల ఎగవేత, సంక్షేమ పథకాల దుర్వినియోగం, నివాస అనుమతి దరఖాస్తుల్లో తప్పుడు సమాచారం ఇచ్చి అధికారులను మోసం చేసే వారికి ఇక్కడ నివసించే హక్కు లేదని స్వీడన్ ప్రభుత్వం పేర్కొంది. పన్నులు లేదా జరిమానాలు చెల్లించకపోవడం కూడా ఉల్లంఘన కిందకే వస్తుందని తెలిపింది. ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడే వ్యక్తుల ప్రవర్తనను నిజాయతీ లేనిదిగా పరిగణించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఎవరైనా వలసదారులను ముప్పుగా భావించే సందర్భాల్లోనూ వారి నివాస అనుమతులు రద్దు చేసే అధికారం తాజా చట్టం కల్పించనుందని తెలిపింది. వలస విధానాల్లో సంస్కరణలు తీసుకొస్తామని హామీ ఇస్తూ 2022లో అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం.. ఆయా చట్టాల్లో మార్పులకు సిద్ధమైంది. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ, బాధ్యతాయుతంగా ప్రవర్తించేలా చూడటమే తమ లక్ష్యమని పేర్కొంది. తమ దేశానికి హాని కలిగించకుండా ఉండేందుకు ఇటువంటి చర్యలు అవసరమని ఇమిగ్రేషన్ మంత్రి జోహాన్ ఫోర్సెల్ స్పష్టం చేశారు.

## ఇరాన్ వార్.. దక్షిణకొరియా క్షిపణి వ్యవస్థకు డిమాండ్..!



పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ.. దక్షిణ కొరియా గగనతల క్షిపణి వ్యవస్థకు భారీగా డిమాండ్ ఏర్పడిందట అరబ్ దేశాలు దాని కొనుగోలుకు పోటీ పడుతున్నాయట. యూఏఈ పైకి ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ 96 శాతం విజయం సాధించినట్లు తెలుస్తోంది. ఈ సక్సెస్ రేటే అనూహ్య డిమాండ్‌కు కారణమని ఆ దేశ మంత్రి ఒకరు అంతర్జాతీయ మీడియాకు వెల్లడించారు. పొరుగుదేశం ఉత్తర కొరియా నుంచి వచ్చే క్షిపణులను అడ్డుకునే లక్ష్యంతో దక్షిణ కొరియా దేశీయంగా క్షిపణి వ్యవస్థ చెయోంగుంగ్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. మధ్యశ్రేణి సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్స్ లక్ష్యంగా దీనిని రూపొందించింది. అమెరికా తయారీ పేట్రియాట్ ప్యాక్-3 వ్యవస్థతో పోటీపడటమే గాకుండా.. దాని ధరలో నాలుగో వంతుకే లభ్యమవుతోంది. "మన దేశ క్షిపణి వ్యవస్థ కోసం పశ్చిమాసియా దేశాలు బారులు తీరుతున్నాయి. ఆ సిస్టమ్ పనితీరే అందుకు కారణం. 90 శాతానికి పైగా సక్సెస్ రేట్‌తో బాలిస్టిక్ క్షిపణులను ధ్వంసం చేస్తోంది" అని దక్షిణకొరియా ఆర్థిక మంత్రి కో యు చియోల్ అంతర్జాతీయ మీడియాతో మాట్లాడారు. అయితే ఏఏ దేశాల నుంచి కొనుగోలుకు ఆసక్తి వ్యక్తమైందో మాత్రం పేర్కొనలేదు. పేట్రియాట్, థాడ్ వ్యవస్థలు పశ్చిమాసియా దేశాల్లో మోహరించి ఉన్నప్పటికీ.. వేగంగా డెలివరీకి అవకాశం ఉన్న చెయోంగుంగ్‌పైనే అరబ్ దేశాలు మొగ్గుచూపుతున్నాయి. అమెరికా ఆయుధాలపై ఆధారపడటం తగ్గించాలన్న ఆలోచనా దీనివెనక ఉన్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే ద.కొరియా వ్యవస్థను యూఏఈ వినియోగిస్తోంది. ఈమేరకు 2022లోనే 3.5 బిలియన్ డాలర్ల డీల్ చేసుకుంది. అదే బాటలో సౌదీ అరేబియా, ఇరాక్ కూడా నడిచాయి.

### పార్టీ మారలేదన్న ఎమ్మెల్యేల కేసు..

## స్పీకర్‌తో సహా ఏడుగురికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్(జనంసాక్షి): పార్టీ మారలేదన్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తెలంగాణ హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. అలాగే తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు సైతం కోర్టు నోటీసులు ఇచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని ఇటీవల అసెంబ్లీ స్పీకర్ తీర్పు ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై ఈ రోజు విచారణ జరిగింది. దాంతో కౌంటర్ దాఖలు చేయాలంటూ ఎమ్మెల్యేలతోపాటు స్పీకర్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీ చేసిన జాబితాలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్ రావు ఉన్నారు. ఏప్రిల్ 16వ తేదీ ఈ కేసు విచారణను వాయిదా వేసింది.

## యాంటీప్రొటాన్ల రవాణా ప్రయోగం విజయవంతం

జెనీవా: ఐరోపా అణు పరిశోధన సంస్థ (సెర్న్) శాస్త్రవేత్తలు ప్రపంచంలోనే తొలిసారిగా ఒక వినూత్న ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. యాంటీప్రొటాన్లను ట్రక్కు ద్వారా ప్రయోగాత్మకంగా రవాణా చేశారు. యాంటీప్రొటాన్ వంటి ప్రతిపదార్థం (యాంటీమ్యాటర్).. సాధారణ పదార్థం (మ్యాటర్)తో కలిస్తే నాశనమవుతుంది. ఈ క్రమంలో శక్తి విడుదలవుతుంది. తాజా ప్రయోగంలో భాగంగా 92 యాంటీప్రొటాన్లను ప్రత్యేకంగా రూపొందించిన క్రయోజెనిక్ పెన్నింగ్ ట్రాప్‌లో ఉంచారు. అందులో భారీగా శీతలీకరించిన, సూపర్ కండక్టింగ్ అయస్కాంతాలను అమర్చారు. ఈ పెట్టెను ట్రక్కులో ఉంచి రోడ్డుపై కొద్దిసేపు రవాణా చేశారు. ఆ తర్వాత తిరిగి ల్యాబ్‌కు తరలించారు. ఈ ప్రయోగ సమయంలో క్రయోజెనిక్ పెన్నింగ్ ట్రాప్ గోడలకు యాంటీప్రొటాన్లు తగలకుండా శూన్యంలో తేలియాడుతూ ఉన్నాయి. పెట్టెల గోడలకు తాకకుండా ఈ రేణువులను ఒక చోటు నుంచి మరో చోటుకు రవాణా చేయవచ్చా అన్నది చూడాలన్నది శాస్త్రవేత్తల ఆలోచన. లోతైన పరిశోధనల కోసం జర్మనీలోని హెయిన్‌రిచ్ హెయిన్ విశ్వవిద్యాలయానికి ఈ యాంటీప్రొటాన్లను తరలించే క్రమంలో ఇది మొదటి అడుగు. ట్రక్కు ఆగినా, అకస్మాత్తుగా బ్రేకులు వేసినా, వేగాన్ని అందుకున్నా రేణువుల భద్రతకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేలా ఈ యాంటీప్రొటాన్ ట్రాప్‌ను రూపొందించారు. యాంటీప్రొటాన్లు చాలా సూక్ష్మంగా ఉంటాయి. వాటి ద్రవ్యరాశి 100 హైడ్రోజన్ పరమాణువుల కన్నా తక్కువ. ఒకవేళ ఆ రేణువు.. పదార్థాన్ని తాకినా విడుదలయ్యే శక్తి చాలా స్వల్పం. అధిక సున్నితత్వం కలిగిన పరికరాలతోనే ఆ శక్తిని గుర్తించడానికి వీలవుతుంది. సెర్న్ ఆధ్వర్యంలోని లార్జ్ హాడ్రన్ కొలైడర్.. ప్రతిపదార్థంపై కొన్నేళ్లుగా అధ్యయనం చేస్తోంది. ఈ వ్యవస్థలోని యాంటీప్రొటాన్ డిసెలరేటర్.. పరిశోధనల కోసం తక్కువ శక్తి కలిగిన యాంటీప్రొటాన్లను ఉత్పత్తి చేస్తోంది. మునుపటి ప్రయోగాల్లో ప్రొటాన్లను రవాణా చేశారు. అయితే యాంటీప్రొటాన్ల రవాణాకు అధిక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతిపదార్థం కూడా సాధారణ పదార్థం తరహాలోనే ఉంటుంది. అయితే దాని విద్యుదావేశం, అయస్కాంత తీరుతెన్నులు.. పదార్థానికి వ్యతిరేకంగా ఉంటాయి.





# కరీంనగర్‌లో హీరోయిన్ మెహరీన్ సందడి

- డాల్ఫిన్ హాస్పిటల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన మెహరీన్
- మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో అత్యాధునిక సేవలు

**కరీంనగర్ టౌన్ మార్చి 25 ( జనం సాక్షి ) :** బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఎఫ్‌టు'లో "హనీ ఈజ్ ది బెస్ట్" అంటూ ప్రేక్షకులను అలరించిన ప్రముఖ హీరోయిన్ మెహరీన్ పిర్జాద్ బుధవారం కరీంనగర్‌లో సందడి చేశారు. సుభాష్ నగర్‌లోని డాల్ఫిన్ హాస్పిటల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి, యాజమాన్యంతో కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అత్యాధునిక వైద్య సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో నమ్మకమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్, ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్లు డా. బి. రమేష్, డా. కె. సురేష్ కుమార్, డా. కంది ప్రశాంత్ రెడ్డి, డా. ఏ. హృదయ రంజన్, డా. హర్ష్, డా. దీప గంజి, బి. రేణుక, కంది నమ్రత, మేనేజర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు. హీరోయిన్ మెహరీన్ పిర్జాద్ హాస్పిటల్ వివిధ శాఖలను సందర్శించి, యాజమాన్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె "హాయ్ కరీంనగర్..!" అంటూ అభిమానులను గిలిగింతలు పెట్టింది.

# కన్నతల్లిని చంపి ఇంట్లోనే పాతిపెట్టిన కూతురు

- ప్రేమకు అడ్డు వచ్చిన తల్లిని కిరాతకంగా హత్య
- మైనర్ కుమార్తె, ప్రియుడు అరెస్టు
- గతేడాది మే నుంచి దాచిన ఘోరం ఆలస్యంగా వెలుగులోకి




**మల్కాజిగిరి, మార్చి 25 (జనం సాక్షి) :** గత ఏడాది మే నెలలో అదృశ్యమైన ఓ మహిళ ఉదంతం విషాదాంతమైంది. తన ప్రేమకు అడ్డు వస్తోందన్న కక్షతో, ప్రియుడితో కలిసి కన్నతల్లినే అత్యంత కిరాతకంగా చంపి, మృతదేహాన్ని ఇంట్లోనే పాతిపెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జవహర్‌నగర్ పోలీసులు ఈ కేసులో నిందితుడు మౌంటీ కుమార్ సింగ్ (22) అలియాస్ మౌంటీ రాజ్‌ను, మైనర్ అయిన మృతురాలి చిన్న కుమార్తెను (17) అరెస్టు చేశారు. నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీ శ్రీధర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు.

జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌకూర్ భరత్ నగర్‌కు చెందిన అంజు డిఆర్ (40) గతేడాది మే 12న పనికి వెళ్లి తిరిగి రాలేదని ఆమె పెద్ద కుమార్తె రోషిణి కుమారి అక్టోబర్ 2025లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొదట 'మహిళా మిస్సింగ్'గా నమోదైన ఈ కేసును లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. బీహార్‌కు చెందిన మౌంటీ కుమార్ సింగ్‌తో మృతురాలి చిన్న కుమార్తె ప్రేమలో పడింది. అయితే బాలిక మైనర్ కావడం, కుల విభేదాల కారణంగా తల్లి అంజు వీరి ప్రేమను తీవ్రంగా వ్యతిరేకించింది. గతంలో మౌంటీపై రెండుసార్లు పోక్సో కేసులు నమోదయ్యాయి. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా వారిద్దరూ సంబంధాన్ని కొనసాగించారు. తల్లి అడ్డు వస్తుందని ఆమెను తొలగించుకోవాలని పథకం పన్నారు.

మే 12, 2025న అంజు పని ముగించుకుని ఇంటికి వచ్చేసరికి, ఇంట్లోనే మాటు వేసిన మౌంటీ కుమార్ ఆమెపై కత్తితో దాడి చేశాడు. బాలిక తన తల్లిని గట్టిగా పట్టుకోగా, మౌంటీ ఆమె గుండెపై పొడిచి చంపాడు. అనంతరం మృతదేహాన్ని గదిలో మంచం కింద పాతిపెట్టి, సిమెంట్, ఇసుకతో కప్పేశారు. ఎలుకల వల్ల నేల పాడైందని, మరమ్మతులు చేశామని పెద్ద కుమార్తెను నమ్మించారు. ఆ తర్వాత నివాసం కూడా మార్చారు.

ఇటీవల పోలీసుల విచారణలో మౌంటీ కుమార్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అసలు విషయం ఒప్పుకున్నాడు. మృతురాలి చిన్న కుమార్తె ప్రస్తుతం గర్భవతి అని, వారు జనవరి 2026లో యాదగిరిగుట్టలో వివాహం చేసుకున్నారని, ఆమెకు రెండు నెలల క్రితమే బాబు పుట్టినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పోలీస్ బృందాన్ని మల్కాజిగిరి డీసీపీ సి.హెచ్. శ్రీధర్, ఏసీపీ చక్రపాణి అభినందించారు.

# సమృద్ధిగా పేట్రోల్, డిజిల్ స్టాక్

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, (జనంసాక్షి) :** జిల్లాలో సమృద్ధిగా పేట్రోల్, డిజిల్ స్టాక్ ఉందని, ప్రజలు అనవసర భయాందోళనకు గురి కావద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పెట్రోల్, డిజిల్ స్టాక్ పట్ల కొంతమంది అనవసరపు ప్రచారాలు చేయడం వల్ల ప్రజలలో కొంత భయాందోళన ఉందని, మన జిల్లా పరిధిలో పెట్రోల్ డీజిల్ కు ఎటువంటి కొరత లేదని, ప్రతి పెట్రోల్ బంకు దగ్గర అవసరమైన మేర స్టాక్ అందుబాటులో ఉందని అన్నారు. జిల్లాలో ఉన్న పెట్రోల్ డీజిల్ స్టాక్‌పై ఎప్పటికప్పుడు సంబంధిత ఐఓసిఎల్, బిపిసిఎల్, హెచ్ పి సిఎల్ ఏజెన్సీ లతో సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు భయాందోళనతో అధికంగా పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయడం వల్ల పెట్రోల్ బంకుల వద్ద స్టాకు త్వరగా ముగుస్తుందని కలెక్టర్ తెలిపారు. పెట్రోల్ బంకుల దగ్గర అవసరమైన మేర పెట్రోల్ డీజిల్ ఎప్పటికప్పుడు రీ ఫిల్ చేసేందుకు చర్యలు చేపట్టామని, జిల్లాకు సరఫరా రెగ్యులర్‌గా జరుగుతుందని, మన రామగుండంలో ఉన్న ఐఓసిఎల్, హెచ్‌పిసిఎల్ డిపోల నుంచి పెట్రోల్ బంక్‌లకు ఎప్పటికప్పుడు రీఫిల్ చేస్తున్నట్లు తెలిపారు.

# చేతిలో ఫోన్ కాదు.. పుస్తకమే ముద్దు

- ప్రపంచ జ్ఞానాన్ని అందించేది గ్రంథాలయం... లైఫ్‌ను మార్చేది లైబ్రరీ
- విద్యార్థుల శ్రేయస్సు కోసం కృషి చేసిన ఫ్రెండ్స్ ఫౌండేషన్‌కు అభినందనలు
- దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు



**తాండూరు, మార్చి 25 జనంసాక్షి :** ప్రపంచ జ్ఞానాన్ని అందించేది గ్రంథాలయమని దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు పేర్కొన్నారు. బుధవారం యాలాల మండలం దేవనూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లైబ్రరీని ప్రారంభించారు. ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఫౌండర్ రిటైర్డ్ ఎడిఈ తుల్జా రామ్‌సింగ్ ఠాకూర్ లైబ్రరీ ఏర్పాటుకు దాదాపు రూ.60,000 విరాళంగా అందజేశారు. కార్యక్రమ సభా అధ్యక్షులు పటేల్ మహేష్ కుమార్, జీహెచ్‌ఎం కరుణాకర్, గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు, ఉపసర్పంచ్ మాధవి మల్లేశం, ఎపీసీ చైర్మన్ సుమిత్ర రాజేందర్, జీపీ సెక్రటరీ పావని, ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రముఖులు కల్వ రాధాకృష్ణ, కల్వ అశోక్, బంటారం సుధాకర్, ప్రసాద్ గౌడ్, మీస్కిన్ శంకర్ రావు, బాలరాజ్ గౌడ్, సుభాష్, మల్లేశం, రవి కుమార్, నరోత్తమ్ రెడ్డి, సునీల్, రాంప్రసాద్, ఎవైఎంసీ చైర్మన్ మాధవ్ రెడ్డి, ఎంఈఓ మహిపాల్ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సుధాకర్, సిద్దామేశ్వర్, ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు మాట్లాడుతూ "చేతిలో ఫోన్ కాదు, పుస్తకమే ముద్దు. లైఫ్‌ను మార్చేది లైబ్రరీ" అన్నారు. విద్యార్థుల శ్రేయస్సు కోసం కృషి చేసిన ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ, 2004లో సమాజ సేవ ఉద్దేశ్యంతో ఫౌండేషన్ ఏర్పాటు చేశామని, విద్యార్థులకు లైబ్రరీపై అవగాహన కల్పించాలని, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, పుస్తకాలను సద్వినియోగం చేసుకుంటే పూర్తి అవగాహన లభిస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఉపయోగపడే మౌలిక వసతులు కల్పిస్తామని, ఉపాధ్యాయుల కోరిక మేరకు పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

***నియోజకవర్గంలో 3500 మందికి ఇందిరమ్మ ఇల్లు***

- 400 మందికి ఇళ్ల స్థలాల మంజూరు
- మొదటిసారిగా 53 మంది ట్రాన్స్ జెండర్స్ కు ఇళ్ల పట్టాలు
- మిగిలిన వారికి వైయస్సార్ ఇళ్ల పట్టాలిస్తాం : ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**గోదావరిఖని, జనంసాక్షి :** అసెంబ్లీలో రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మాట్లాడారు. రామగుండం నియోజకవర్గంలో నిరుపేదలను గుర్తించి 3500 మందికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చామని, అంతేకాకుండా 400 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని, వారికి ఇల్లు కట్టుకునేందుకు 5 లక్షలు ఇస్తామన్నారు. అయితే గత ప్రభుత్వం 10 ఏళ్లలో డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాల పేరిట అనవసరపు ఖర్చులు చేసిందని, వాటిని నిరుపయోగంగా వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా 53 మంది ట్రాన్స్ జెండర్స్ కు ఇళ్లపట్టాలిచ్చామని పేర్కొన్నారు. అదేవిధంగా వారికి ఇప్పటికే వివిధ విభాగాలలో ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అయితే వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్న సమయంలో సింగరేణి ప్రాంతంలో జెన్కో సింగరేణి భూములలో ఇల్లు కట్టుకున్న వారికి వైఎస్ఆర్ పట్టాలు 18,000 వరకు ఇచ్చామని గుర్తు చేశారు. అదేవిధంగా మరో 7 వేల మందికి ఇచ్చేది ఉందని గుర్తు చేశారు. ఇంకా 11 వేల మంది నిరుపేదలను గుర్తించామని, వారికి ఖాళీ స్థలాలలో ఇందిరమ్మ ఇళ్ళను నిర్మించి ఇందిరమ్మ కాలనీగా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

# విధి నిర్వహణలో ప్రమాదం.. లైన్మెన్‌కు తీవ్ర గాయాలు

**పరామర్శించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్ బ్యూరో, మార్చి 25 (జనంసాక్షి) :** విధుల నిర్వహణలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాకు తగిలి గాయాలతో ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న లైన్ మెన్ శివను మేయర్ కొలగాని శ్రీనివాస్ పరామర్శించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఎలక్ట్రికల్ విభాగం లో లైన్ మెన్ గా పని చేస్తున్న శివ అలుగునూరులో స్ట్రీట్ లైట్ బిగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురయ్యారు. దీంతో విషయం తెలుసుకున్న మేయర్ కొలగాని శ్రీనివాస్ లైన్ మెన్ శివను చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు, సిబ్బంది లైన్ మెన్ ను చికిత్స నిమిత్తం హాస్పిటల్ తరలించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ హుటా హుటిన హాస్పిటల్ కు చేరుకొని, లైన్ మెన్ శివ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ దగ్గరుండి శివకు వైద్యులతో చికిత్స చేయించారు. అనంతరం వైద్యులను శివ ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీసి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... ఎలక్ట్రికల్ విభాగం లో పని చేసే సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ప్రస్తుతం శివ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ముఖ్యంగా స్ట్రీట్ లైట్లు బిగిస్తున్న సమయంలో సంబంధిత పోల్స్ కి విద్యుత్ సరఫరా లేకుండా చూస్కోవాలని, ముందస్తు జాగ్రత్త చర్యలతో విధులు నిర్వర్తించాలని సూచించారు. స్ట్రీట్ లైట్స్ బిగించే సమయంలో అధికారులు స్థానికంగా ఉండి పర్యవేక్షణ చేయాలని, సిబ్బంది పని చేసే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మున్సిపల్ సిబ్బంది పరామర్శించారు.

# చేనేతలకు ఆర్థికంగా, రాజకీయంగా అన్యాయం చేస్తున్నారు

- కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- ప్రభుత్వం ధర్నాలను అణచివేస్తోందని విమర్శ
- త్రిఫ్ట్ పథకం బకాయిలు, రుణమాఫీ, గుర్తింపు కార్డులివ్వాలి



**ముషీరాబాద్, మార్చి 25 (జనంసాక్షి) :** చేనేతలకు ఆర్థికంగా, రాజకీయంగా అన్యాయం చేస్తున్నారని, కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్ద ఉన్న ధర్నా చౌక్‌లో చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఈ డిమాండ్లు లేవనెత్తారు.

ఎమ్మెల్సీలు ఎల్. రమణ, నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రిటైర్డ్ ఐఏఎస్ బీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ చైర్మన్ చిరంజీవులు, తెలంగాణ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు వనం శాంతి కుమార్, సిఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముషం రమేష్, ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే తెగించి పోరాడాలని, పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని వక్తలు అన్నారు. గతంలో ధర్నాలు చేస్తే ప్రభుత్వాలు వెంటనే స్పందించేవని, ప్రస్తుతం ధర్నాలు చేస్తే అరెస్టులు, గృహ నిర్బంధాలు చేసి అణచివేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ధర్నాలను గుర్తించి సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

వ్యవసాయం తర్వాత అత్యంత ప్రాధాన్యత కలిగిన చేనేత పరిశ్రమను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు అనేక హామీలు ఇచ్చి ఓట్లు కొల్లగొట్టి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు వారి సమస్యలను విస్మరిస్తోందని విమర్శించారు.

**ప్రధాన డిమాండ్లు :**

- త్రిఫ్ట్ పథకంలో కార్మికులు నెలల తరబడి రికరింగ్ డిపాజిట్ చేస్తున్నా ప్రభుత్వం రెండు నెలలు మాత్రమే డిపాజిట్ చేసి మినకుండా పోయింది. బకాయిలు వెంటనే డిపాజిట్ చేయాలి.
- 2026-27 బడ్జెట్‌లో చేనేతలకు రూ.2000 కోట్లు, టెక్స్‌టైల్స్ పవర్‌లూమ్‌లకు రూ.2000 కోట్లు వేరువేరుగా కేటాయించాలి.
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన నేతన్న రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేసి, జీరో వడ్డీతో కొత్త రుణాలు రూ.5 లక్షలు ఇవ్వాలి.
- చనిపోయిన చేనేత కార్మికుల కుటుంబాలకు నేతన్న భీమా ఎక్స్‌గ్రేషియా వెంటనే అందించాలి.
- 13 సంవత్సరాలుగా ఎన్నికలు నిర్వహించకుండా చేనేత కార్మికులకు రాజకీయంగా అన్యాయం చేస్తున్నారు.
- ప్రభుత్వం ఉత్పత్తి చేస్తున్న వస్త్రాలకు పవర్‌లూమ్ కార్మికులకు సబ్సిడీ అందించాలి.

అర్హులైన చేనేత కార్మికులందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలి. ప్రభుత్వం నుంచి రావాల్సిన వస్త్ర పరిశ్రమ బకాయిలు వెంటనే చెల్లించాలి. ఈ ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, లల్లెల బాలకృష్ణ, పైళ్ల ఆశయ్య, చేనేత కార్మిక సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసికంటి లక్ష్మీనరసయ్య, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి చోళ రాజేశం, రాష్ట్ర అధ్యక్షులు బాసాబత్తిని రాజేశం తదితర నాయకులు పాల్గొన్నారు.

## పక్కదారి పడుతున్న ఎస్సీ రిజర్వేషన్లను సక్రమంగా అమలు చేయాలి

**బోడుప్పల్-జనంసాక్షి :** భారత రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీలకు ప్రసాదించిన రిజర్వేషన్లను సక్రమంగా అమలుచేసే విధంగా ప్రభుత్వాలకు కనువిప్పుకల్గించాలని కోరుతూ దళిత సమాఖ్య, మేడిపల్లి ఏకలవ్య కమిటి ప్రతినిధులు బుధవారం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సమాఖ్యప్రతినిధులు వెంకటేశ్, శివ, సంపత్, రావుల శ్రీకాంత్ తుషార్ లు మాట్లాడుతూ మతం మారిన వ్యక్తులు అక్రమంగా అనుభవిస్తూ ఎస్సీ, ఎస్టిలకు అన్యాయం చేస్తున్నారన్నారు. నిజమైన అర్హులకు రిజర్వేషన్లను దూరం చేసి అనర్హులకు అందలం ఎక్కిస్తూ నిజమైన దళితులకు సామాజిక అభివృద్ధిఫలాలను అందకుండా చేస్తున్నారన్నారు. ఇతర మతాలకు చెందిన వ్యక్తులు దళిత వాదాన్ని వాడుకుంటూ సమాజాన్ని అయోమయానికి గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. పవిత్ర భారతీయ వేదాలను కించపరుస్తూ ఎమ్మెల్యే మందుల సామేల్ ను ప్రశ్నిస్తూ ఇంటివద్ద నిరసన వ్యక్తం చేసిన వారిని అరెస్ట్ చేసిన పోలీసులు వారిని బేషరతుగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కన్నెబోయిన రాము యాదవ్ పై పెట్టిన అన్ని కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మతం మారితే కులం వర్తించదంటూ దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పును బట్టి సమాజంలో అలజడి సృష్టిస్తూ ప్రజలను అశాంతికి గురి చేస్తున్న మందుల సామేల్ పై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఏకలవ్య కమిటి ప్రతినిధులు డిమాండ్ చేశారు.

# సీఎం కప్ 2025లో కరీంనగర్‌కు తృతీయ స్థానం

**44 విభాగాల్లో 55 మెడల్స్... అభినందించిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్ బ్యూరో, మార్చి 25 (జనంసాక్షి):** సీఎం కప్ 2025 పోటీల్లో కరీంనగర్ జిల్లా రాష్ట్రంలో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. సుమారు 44 విభాగాల్లో 55 మెడల్స్ సాధించిన కరీంనగర్ విద్యార్థులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అభినందించారు. సీఎం కప్ లో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలు క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటినందుకు 79.4 పాయింట్లతో కరీంనగర్ జిల్లా మూడో స్థానాన్ని సొంతం చేసుకుంది. హైదరాబాదులో మంగళవారం రోజు నిర్వహించిన సీఎం కప్ విజేతల ఎంపిక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా జిల్లా క్రీడాకారులు కప్ అందుకున్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు, కోచ్ లు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భవిష్యత్తులో జాతీయస్థాయిలో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. విద్యార్థులను తీర్చిదిద్దిన కోచ్ లను, కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల సిబ్బందిని, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్దన్ రెడ్డి, సభ్యులు రమేష్ రెడ్డి, యోగ అసోసియేషన్ ప్రెసిడెంట్ సిధారెడ్డి, కోచ్ లు పవన్, శ్రీకాంత్, సంపత్, విక్రం, సాయి, ఇందిరా, కిష్టయ్య రామకృష్ణ, వికాస్, శ్యాం పాల్గొన్నారు.

# ఆర్టీసీ ప్రయాణికులకు బంపర్ ఆఫర్

- మెట్రో ఏసీ, డీలక్స్ బస్సుల్లో 30% రాయితీ
- పెట్రోల్ క్యూలకు స్వస్తి.. ఆర్టీసీ బస్సులు ఉండగా ఎందుకు ఇబ్బంది?
- రాష్ట్ర ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్బోధ

**ముషీరాబాద్, మార్చి 25:** ప్రస్తుత ఇంధన కొరత నేపథ్యంలో నగరవాసులకు ఊరటనిచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ పరిధిలోని మెట్రో ఏసీ, మెట్రో డీలక్స్ బస్సుల్లో టికెట్ ధరలపై 30 శాతం రాయితీని అమలు చేస్తున్నట్లు సంస్థ ఎండీ వై. నాగిరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ "పెట్రోల్ ఇబ్బందులు పడటం ఎందుకు దండగ.. ఆర్టీసీ బస్సులు ఉండగా!" అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. రానున్న మూడు నెలలకు సరిపడా ఇంధన నిలువలు ఉన్నాయని, ఎవరూ గందరగోళంలో పడొద్దని స్పష్టం చేశారు.

**సమయం, ఇంధనం ఆదా :**

పెట్రోల్ బంకుల వద్ద గంటల తరబడి క్యూలలో నిలబడి సమయాన్ని వృథా చేసుకోవద్దని ఎండీ నాగిరెడ్డి సూచించారు. సొంత వాహనాలకు బదులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం ద్వారా సమయం, ఇంధనం ఆదా చేయవచ్చని తెలిపారు. వ్యక్తిగత వాహనాల రద్దీ తగ్గడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తీరడమే కాకుండా, కాలుష్యం కూడా తగ్గుతుందని, ముఖ్యంగా ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రయాణించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఆయన కోరారు.

**జేబుకు హాయి :**

మెట్రో ఏసీ, డీలక్స్ బస్సుల్లో 30 శాతం రాయితీతో సుఖవంతమైన ప్రయాణాన్ని అతి తక్కువ ధరకు ఆస్వాదించవచ్చని ఎండీ వివరించారు. బంకుల వద్ద బారులు తీరొద్దని, సేఫ్‌గా ఆర్టీసీ బస్సులెక్కి సుఖవంతమైన ప్రయాణం చేయాలని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు. ఈ బంపర్ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకుని ట్రాఫిక్, పెట్రోల్ ఇబ్బందుల నుంచి బయటపడాలని టీజీఎస్‌ఆర్టీసీ ఆకాంక్షిస్తోందని ఎండీ నాగిరెడ్డి తెలిపారు.

## పభుత్వ ఆసుపత్రిలో వైద్యుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహణ

**జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్**

**పెద్దపల్లి, (జనంసాక్షి) :** మార్చి 28న శనివారం రోజున ఉదయం 11 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో గల తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న గైనకాలజీ, ఆప్తామాలజిస్ట్, రేడియాలజీ, ఆర్థోపెడిషియన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (ఎంబిబిఎస్) పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు మార్చి 28న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని అన్నారు. ఆసక్తి గల వైద్యులు తమ యొక్క దరఖాస్తు బయోడేటాతో పాటు అన్ని విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్ల తో పాటు జిరాక్స్ ప్రతులు ఒక సెట్ తో హాజరు కావాలని, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నెలకు లక్ష రూపాయలు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు నెలకు 52,351 రూపాయల వేతనం ఉంటుందని, ఇతర వివరాలకు 8499061999,9492457809 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# విద్యార్థులను ప్రతి సబ్జెక్టులో పరిపూర్ణంగా సిద్ధం చేయాలి

- పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ దీపక్ తివారి సూచన
- ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలి
- ఆరోగ్య, విద్య, రోడ్లు, పంచాయతీ భవనాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు



**నవాబుపేట్, మార్చి 25 (జనంసాక్షి) :** పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న క్రమంలో విద్యార్థులందరూ ప్రతి సబ్జెక్టులో పట్టు సాధించాలని, ఏవైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయుల ద్వారా నివృత్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. బుధవారం నవాబుపేట్ మండలంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసిల్దార్ కార్యాలయాలను సందర్శించి, ఉపాధి హామీ కింద చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ముందుగా విద్యార్థుల హాజరు పట్టిక, సైన్స్, ఫిజిక్స్ ల్యాబ్‌లు, క్రీడా సామాగ్రి, ఎంబ్రాయిడరీ, కుట్టు పని నేర్పించే గదులను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన క్రమంలో ప్రజలందరికీ పూర్తిస్థాయిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారికి సూచించారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని వైద్య అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం షెడ్ నిర్మాణం చేపట్టాలని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్ కుమార్‌కు సూచించారు. రోగుల వివరాలు, వైద్య పరీక్షల నమోదు రిజిస్టర్లు, ఇన్‌పేషెంట్ గదిని కలెక్టర్ పరిశీలించారు. తదనంతరం కేశవపల్లి గ్రామంలో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి, నాణ్యతతో పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అసంపూర్తిగా ఉన్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ అంచనాలను సమర్పించాలని తెలిపారు. నిర్మాణ దశలో ఉన్న మహిళా సమాఖ్య భవనాన్ని పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ పర్యటనలో తహసిల్దార్ బుచ్చయ్య, ఎంపీడీవో అనురాధ, ఎంఈఓ అబ్దుల్ రెహమాన్, ప్రిన్సిపల్ కృష్ణ కుమార్, డాక్టర్ రోహిత్ కుమార్, సర్పంచ్‌లు బలవంత్ రెడ్డి, నరసింహారెడ్డి, మాణిక్యం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా ముందస్తు శ్రీరామనవమి వేడుకలు

**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి**



**కరీంనగర్ బ్యూరో, మార్చి 25 (జనంసాక్షి):** శ్రీరాముడు ధర్మానికి ప్రతీక అని ప్రేమ ఆప్యాయతకు గొప్ప నిర్వచనమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా ఏర్పాటు చేసినటువంటి ముందస్తు శ్రీరామనవమి వేడుకలకు ఆత్మీయ అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి శ్రీరాముని చిత్రపటానికి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని శోభయమానంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీరాముడిని కొలిచిన వారికి కష్టాలు తొలగిపోతాయని, విజయాలు కలుగుతాయని వారు తెలిపారు. శ్రీరాముని గురించి తెలిపేటువంటి రామాయణ గ్రంధాన్ని పఠించినట్లయితే ఉజ్వలమైన భవిష్యత్తు లభిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని భారత దేశంలో గొప్ప పండుగగా నిర్వహించుకుంటారని ప్రధానంగా మన దేశ రాజధాని లోని ఢిల్లీలో గల రాం లీల మైదానంలో చాలా గొప్పగా ఈ వేడుకను నిర్వహించడం భారత దేశ ప్రజలకు గొప్ప అనుభూతినిస్తుందని వారు చెప్పారు. భారతదేశ సంస్కృతి ఉట్టిపడేలా ఈ వేడుకలను చాలా ఉత్సాహంతో భక్తిశ్రద్ధలతో యావత్ భారతదేశంలోనే కాకుండా వివిధ దేశాలలో సైతం శ్రీరామనవమిని చాలా పవిత్రమైన పండుగగా జరుపుకుంటానని వారు చెప్పారు. శ్రీరామనవమిని పరిష్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధానంగా "శ్రీరామ చరిత్ర" ను లవకుశల వేషధారణలో విద్యార్థులు చాలా చక్కగా వర్ణించారు. రామాయణంలోని ప్రధాన ఘట్టాలు తెలిపే సమయాన విద్యార్థులందరూ జైశ్రీరామ్.. జైశ్రీరామ్ నినాదాలు చేసి పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఒక వ్యక్తికి ఒకే ఓటుపై రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 25 (జనంసాక్షి) :** ఒక వ్యక్తికి ఒకే ఓటుపై రాజకీయ పార్టీ నాయకులతో బుధవారము వేములవాడ తహసిల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ రాధాబాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరుగనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కై వేములవాడ నియోజకవర్గంలో బూత్ స్థాయిలో రాజకీయ పార్టీల పరంగా బూత్ ఎజెంట్ల నియమకంపై వారికీ వివరించారు. భారత దేశంలో ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్న ఉద్దేశ్యంతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రత్యేక ఓటర్ల సవరణ పేరిట త్వరలో కార్యక్రమం చేపట్టనునందున వేములవాడ నియోజకవర్గం స్థాయిలో గల 262 పోలింగ్ కేంద్రాల్లో ప్రభుత్వ పరంగా ప్రతి పోలింగ్ బూత్ కు ఒకరి చొప్పున 262 మందిని బూత్ లేవల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల నుండి ప్రతి బూతుకు ఒకరు చొప్పున 262 బూతులకు బూత్ లేవల్ ఎజెంట్ల వివరాలను తొందరగా తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సమావేశానికి హాజరైన వారిని కోరారు. ఈ సమావేశంలో నిత్యానందరావు, పొలాస నరేందర్,పిన్నింటి హన్మాండ్లు చింతలకోటి రామస్వామి గౌడ్ తహసీల్దార్ ఎ.జయంత్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం

- చేసిన పనికి కూలీ డబ్బులు రాక ఇబ్బందులు
- అధికారుల తనిఖీలు లేక మండుటెండలో కూలీల అవస్థలు
- ఐరిస్ కాప్చర్ తో కూలీలకు ఇబ్బందులు
- ఉపాధి హామీ పనుల సందర్శనలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు గూడెం లక్ష్మి



**చిగురుమామిడి మార్చి 25 (జనంసాక్షి):** ఉపాధి కూలీలకు ప్రభుత్వం కల్పించాల్సిన కనీస సౌకర్యాలను కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఉపాధి హామీ పనుల్లో అధికారుల తనిఖీలు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మాజీఎంపీటీసీ గూడెం లక్ష్మి ఆరోపించారు.బుధవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని ఎర్రగుంటలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను గూడెం లక్ష్మి సందర్శించారు.ఈ సందర్భంగా కూలీల సమస్యలను ప్రత్యక్షంగా నక్క కేతవ్వ, బొల్లి ఎంకవ్వ, బెజ్జంకి ఓదవ్వ,జిల్లెల్ల రజిత,బెజ్జంకి కనకవ్వతోపాటు తదితర కూలీలను అడిగి తెలుసుకున్నారు.ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ,పనుల ప్రదేశాల్లో త్రాగు నీరు, నీడ సౌకర్యం,ప్రథమ చికిత్స పెట్టెలు వంటి కనీస వసతులు కల్పించడంలో అధికారులు ఫలమయ్యారని మండిపడ్డారు.కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఎండలో పనులు చేసే కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి ప్రాణాలకు ముప్పు కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఫీల్డ్ అసిస్టెంట్‌లు సమయానికి మొబైల్ యాప్‌లో హాజరు నమోదు చేయకపోవ డం, పనుల గుర్తింపులో జాప్యం కారణంగా కూలీలు ఇబ్బందులు పడుతు న్నారని చెప్పారు. వ్యవసాయ పనులు లేకపోవడంతో పస్తులు ఉంటూ ఉపాధి పనులకు వస్తే నెలలు గడిచినా కూలీ డబ్బులు రాకపోవడంతో పరిస్థితి మరి దారుణంగా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచా యతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ సౌకర్యాల ను పర్యవేక్షించడంలో విఫలం కావడం వల్లే కూలీలు ఇబ్బందులు పడుతు న్నారని మండిపడ్డారు.పని ప్రదేశం వద్ద కూలీల ఐరిస్ ను యాప్ సరిగ్గా గుర్తించడం లేదని,దీనివల్ల గంటల తరబడి మండుటెండలో ఇబ్బందులు పడుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధి కూలీలకు కల్పించాల్సిన సౌకర్యాలను కల్పించకపోతే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని గూడెం లక్ష్మి హెచ్చరించారు.



# సురక్షిత డ్రైవింగ్ అలవాట్లు అలవరచుకోవాలి

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత : పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి

**గోదావరిఖని, జనంసాక్షి :** అరైవ్ – అలైవ్ ఫేజ్–3లో భాగంగా రామగుండం రైల్వే స్టేషన్ వద్ద ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహిస్తున్న "అరైవ్ – అలైవ్" మూడో దశ కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ ఆధ్వర్యంలో రామగుండం రైల్వే స్టేషన్ వద్ద బుధవారం ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీ పెద్దపల్లి బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ హాజరై ఆటో డ్రైవర్లను ఉద్దేశించి ప్రసంగించారు. డీసీపీ మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, అధిక ప్రయాణికులను ఎక్కించకూడదని, వేగ పరిమితులను పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలు నడిపినప్పుడు హెల్మెట్ ఫోర్ వీల్స్ నడిపినప్పుడు సీట్‌బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే నష్టాలను వివరించి, సురక్షిత డ్రైవింగ్ అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామగుండం సిఐ ప్రవీణ్ కుమార్, రామగుండం ఎస్సై సంధ్యారాణి, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** రాజీవ్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి సేవల నిర్వహణపై తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, రోగులకు అందుతున్న సౌకర్యాలు, హాజరు రిజిస్టర్లు తదితర అంశాలను పరిశీలించారు. ఆసుపత్రిలో శుభ్రత, వైద్య సిబ్బంది సమయపాలన, రోగుల పట్ల వ్యవహార శైలి వంటి విషయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా, ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య సేవలను సమర్థవంతంగా వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వైద్యాధికారి సాయి ఈశ్వరి, సంబంధిత వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 2047 లక్ష్యంతో డిజిటల్ ఇండియా నిర్మాణం

- శాతవాహన విశ్వవిద్యాలయంలో డిజిటల్ పరివర్తనపై రెండు రోజుల జాతీయ సదస్సు
- యువత డిజిటలైజేషన్‌లో కీలక పాత్ర పోషించాలి : ఆచార్య రవికుమార్ జాస్తీ
- ఏఐ, రోబోటిక్స్ ద్వారా వాణిజ్య రంగం వేగవంతం
- 130 పరిశోధన పత్రాలు సమర్పణ, జర్నల్‌లో విడుదల



**కరీంనగర్ బ్యూరో, మార్చి 25 (జనంసాక్షి):** శాతవాహన విశ్వవిద్యాలయంలో "ట్రాన్స్‌ఫార్మేటివ్ రోల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఇన్ ది జర్నీ ఆఫ్ 2047" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది. విశ్వవిద్యాలయ రిజిస్ట్రా ర్ ఆచార్య సతీష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో డిజిటల్ పరివర్తన ద్వారా దేశం డిజిటల్ ఇండియాగా మారుతుందని, వాణిజ్య, వ్యాపార రంగాల్లో గొప్ప మార్పులు వస్తాయని ఆయన అన్నారు. ఆర్థిక రంగంలో డిజిటల్ చెల్లింపుల వల్ల బ్యాంకింగ్ సేవలు ఆధునికమవుతున్నా యని, విద్యారంగంలో ఆన్‌లైన్ విద్యలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, 2047 వరకు ఈ మార్పులు మరింత వేగంగా అభివృద్ధి చెందాలని ఆచార్య సతీష్ కుమార్ వ్యాఖ్యానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ, డిజిటల్ పరివర్తన ద్వారా గత పదేళ్లలో 'మేక్ ఇన్ ఇండియా', 'మేక్ ఫర్ ఇండియా' నినాదాలతో సాంకేతిక విషయాలను సామాన్యుడికి అనుసంధానం చేస్తూ వికసిత భారత్ నిర్మాణాని కి పునాదులు వేస్తున్నామని తెలిపారు. మానవ జీవితంలో డిజిటల్ సాంకేతిక త ఒక అవయవంగా మారిపోయిందని, దీని ద్వారా భారత ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావచ్చని ఆకాంక్షించారు. కీలక ఉపన్యాసకులుగా విచ్చేసిన ఆచార్య జాస్తి రవికుమార్ (ఆల్ ఇండియా కామర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ) మాట్లాడుతూ, డిజిటలైజేషన్ వల్ల వాణిజ్య, ఉత్పత్తి రంగాల్లో ఆధునిక సేవలు, ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని, 2020 నుంచి 2030 వరకు అభివృద్ధికర వసతులు, 2040 వరకు అత్యంత వేగం, 2047 వరకు డిజిటల్ చెల్లింపులు, డేటా ఆధారిత నిర్వహణలో నైపుణ్యాలు మార్పులు వస్తాయని వివరించారు. ప్రతి పౌరుడు డిజిటల్ అక్షరాస్యతను సాధించి, సాంకేతికతను సృష్టించే స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు.

సదస్సు డైరెక్టర్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. హరికాంత్ మాట్లాడుతూ, రెండు రోజుల సదస్సులో 130 పరిశోధన పత్రాలు సమర్పించబడ్డాయని, వాటిని ×రూచీ జర్నల్ మూడు భాగాలుగా విడుదల చేస్తామని తెలిపారు. ఇలాంటి సదస్సులు పరిశ్రమలు, విశ్వవిద్యాలయాల మధ్య బంధాన్ని బలోపేతం చేసి, దేశం సాంకేతిక విప్లవం వైపు నడుస్తుందని అన్నారు.

ఈ సదస్సుకు సెమినార్ కో-కన్వీనర్లుగా డా. కె. తిరుపతి, డా. బి. నరేష్, డా. బి. పరుశురాములు, డా. ఈ. మనోహర్, డా. ఎన్.వి. శ్రీరంగ ప్రసాద్, డా. ఎం. మనోజ్ కుమార్, సావిత్రి తదితరులు పని చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెడికల్ బోర్డు పైన విజిలెన్స్ కేసు..ఏసిబి కేసులు

- రాష్ట ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యలను వ్యతిరేకిస్తున్నాం
- సేవ్ సింగరేణి పోరుజాత గేట్ మీటింగ్ లలో సీతారామయ్య, రాజ్ కుమార్




**గోదావరిఖని, జనంసాక్షి :** ఓపెన్ కాస్టుల్లో జరుగుతున్న అవినీతి, టెండర్లలో ఉన్న అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, యాజమాన్యం వాటిని పక్కనపెట్టి, ఎలాంటి విజిలెన్స్ కేసులు గాని, ఏసిబి కేసులు గాని బాధ్యులపై నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ వారికి వత్తాసు పలుకుతున్న, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం, కష్టపడి పని చేసి బొగ్గు తీసిన కార్మికుల పట్ల పక్షపాత ధోరణి అవలంబించడం తీవ్రంగా ఖండిస్తున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం సింగరేణి ఆర్జీ త్రీ ఏరియా లోని వివిధ గనులు, డిపార్ట్మెంట్ ల పై సేవ్ సింగరేణి పోరు జాత కార్యక్రమం లో భాగంగా జరిగిన గేట్ మీటింగ్ లలో వారు పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో కార్మికులు అనారోగ్య కారణాల చేత ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డుపై గతంలో అవినీతి జరిగిందనే కారణంతో ప్రస్తుతం విజిలెన్స్, ఏసీబీ కేసుల పేరుతో మెడికల్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడం దుర్మార్గమైన చర్య అని వారు పేర్కొన్నారు. గతంలో అవినీతి జరిగి ఉంటే, అందుకు బాధ్యులైన అధికారులు ఎవరైతే ఉన్నారో వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా కష్టపడి బొగ్గు తీసి దేశానికి వెలుగు నిచ్చే కార్మికులపై ఈ విధంగా మెడికల్ బోర్డును నిలిపివేసి అన్యాయం చేయడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. మార్చి 24 న అసెంబ్లీలో మెడికల్ బోర్డు విషయమై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గారు చేసిన వ్యాఖ్యలను గుర్తింపు సంఘం ఏఐటియుసి తీవ్రంగా ఖండిస్తుందని వారు పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరించాల్సిన సమయంలో ఇలాంటి కార్మిక వ్యతిరేక వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని వారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మూడు సార్లు మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి పై, కార్మికుల పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితుందని వారు విమర్శించారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే మెడికల్ బోర్డును పునరుద్దరించాలని ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని వారు డిమాండ్ చేశారు. లేకుంటే యాజమాన్యం, ప్రభుత్వం పై ఏఐటియుసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.


# పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ కొరత లేదు.. రాష్ట్రంలో సరిపడా నిలువలు

- వదంతులు నమ్మి గందరగోళన వద్దు : మంత్రి ఉత్తమ్
- అందుబాటులో మూడు నెలలకు సరిపడా ఇంధనం
- ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 25 (జనం సాక్షి):** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ కొరత ఉత్పన్నమయ్యే ప్రసక్తి లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో డీజిల్, పెట్రోల్ బంకుల వద్ద పెద్ద ఎత్తున క్యూలు ఏర్పడడాన్ని చూసి కొరత ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇంధన వనరులతో పాటు ఎల్‌పీజీ కొరత అంటూ వస్తున్న వదంతులతో ప్రజలెవరూ గందరగోళంలో పడొద్దని, ఆందోళన చెందొద్దని మంత్రి ఉద్బోధించారు. రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి మీడియాతో మాట్లాడుతూ రానున్న మూడు నెలలకు సరిపడా నిలువలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం కంపెనీలు ఇంధన సరఫరాలను గణనీయంగా పెంచాయని ఆయన తెలిపారు. డిమాండ్‌ను మించి సరఫరా కొనసాగుతోం దని, ఈ రోజు 17,246 కిలోలీటర్ల డిమాండ్ ఉండగా 17,898 కిలోలీటర్ల సరఫరా జరిగి 652 కిలోలీటర్ల అదనపు నిల్వ మిగిలిందని వివరించారు. అదనంగా 16,000 కిలోలీటర్ల ఇంధనం నిల్వ ఉంచడంతో పాటు 1,200 అదనపు ట్యాంకర్లను వినియోగిస్తున్నామని తెలిపారు.

వినియోగదారులు గందరగోళంలో పడి పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేయడంతో రోజువారీ డిమాండ్ 25 శాతం పెరిగినా, సగటు సరఫరాతో పోల్చితే 22 శాతం అదనపు ఇంధనం అందుబాటులో ఉందని మంత్రి పేర్కొన్నారు. కొన్ని పెట్రోల్ బంకులకు నిర్ణీత సమయానికి ట్యాంకర్లు చేరుకోకపోవడంతో 'నో స్టాక్' బోర్డులు వెలుస్తున్నాయని, వాస్తవానికి ఎక్కడా కొరత లేదని పునరుద్ఘాటించారు. కంటైనర్లు, డబ్బాల్లో పెట్రోల్, డీజిల్ తీసుకెళ్లడం చట్టవ్యతిరేకమని, ప్రమాదకరమని హెచ్చరించారు. పెట్రోలియం నిలువలు రా నున్న 65 రోజులకు సరిపడా ఉన్నాయని, ఓజీసీ లైన్‌ను విస్తరించి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తున్నామని తెలిపారు. రాష్ట్ర రాజధానిలో 596 పెట్రోల్ బంకులు నిరంతరాయంగా పని చేస్తున్నాయని, హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలో ఎక్కడా కొరత లేదని స్పష్టం చేశారు. ఎల్‌పీజీ విషయంలో కొరత లేదని, కేవలం కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంత సమస్య ఉందని, అక్రమంగా వినియోగిస్తున్న 2,952 కమర్షియల్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని వెల్లడించారు. గృహ వినియోగ దారులకు ఎల్‌పీజీ సమృద్ధిగా అందుబాటులో ఉందని, ప్రజలెవరూ అయోమయానికి గురికావొద్దని, వదంతులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని మంత్రి ఉత్తమ్ కుమార్ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.



### రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యురాలిగా 'శైలజ 'ఎన్నిక

**గోదావరిఖని :** బార్ అసోసియేషన్ సభ్యురాలు, మాజీ అధ్యక్షురాలు ,న్యాయవాది చందాల శైలజ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యురాలుగా ఎన్నికయ్యారు.జనవరి 30 న 23 మంది సభ్యుల ఎన్నిక కోసం 203 మంది న్యాయవాదులు రాష్ట్ర వ్యాప్తంగా పోటీ పడగ మహిళా విభాగం నుంచి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం నిలిచి సభ్యురాలుగా ఎన్నికయ్యారు.5 ఏండ్ల పాటు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు .శైలజ అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) మహిళా విభాగపు కన్వీనర్‌గా ,రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.తన ఎన్నిక కు సహకరించిన న్యాయవాదులకు,ఖని బార్ అసోసియేషన్ సభ్యులకు ,ఐలు సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి బార్ కౌన్సిల్ గా ఎంపికైన వారిలో శైలజ ఒక్కరే ఎన్నిక కావటం విశేషం .

### చెరువులో ఈతకు వెళ్లి మృతి

**పిట్లం :** మండల కేంద్రంలోని పెద్ద చెరువు లోకి ఈత కొట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. మృతి చెందిన వ్యక్తి పిట్లం గ్రామానికి చెందిన పడమటి కిరణ్ (30) గుర్తించారు. మంగళవారం రోజున సుమారుగా 10 గంటల సమయంలో పెద్ద చెరువులో ఈత కొట్టడానికి వెళ్ళాడు. బుధవారం రోజున శవమై తేలాడు.మృత్యుడి కి ఇద్దరు కూతుళ్లు సంతానం కలదు. మృతుని తల్లి అయినా నర్సవ్వ ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ వెంకట్ రావు తెలిపారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- రూ.2400 మద్దతు ధరకు అవకాశం
- దళారులకు పంట అప్పగించకుండా ప్రభుత్వ కేంద్రానికి తీసుకురావాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందనకు రైతులు ధన్యవాదాలు




**చిగురుమామిడి, మార్చి 25 (జనంసాక్షి) :** రైతులు కష్టించి పండించిన మొక్కజొన్న పంటను మధ్య దళారులకు అప్పగించకుండా, ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించి రూ.2400 మద్దతు ధరను పొందాలని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ జంగాపల్లి ఐలయ్యలు పిలుపునిచ్చారు. ఈ నెల 20న 'మొక్కజొన్న కొనుగోలు కేంద్రం లేక దళారుల పాలవుతున్న మొక్కజొన్న పంట' అంటూ జనంసాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించి, చిగురుమామిడి మండల కేంద్రంలో బుధవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో డీసీఎంఎస్ సహకారంతో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్, తహసీల్దార్ ముద్దసాని రమేష్, ఎంపీడీవో విజయ్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి తాటిపల్లి పూర్ణచందర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన చైర్మన్ తిరుపతిరెడ్డి, నాణ్యమైన మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి రూ.2400 మద్దతు ధరను పొందాలని రైతులకు సూచించారు. ధాన్యం విక్రయించిన వారంరోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని తెలిపారు. మెట్ట ప్రాంతమైన చిగురుమామిడి మండలంలో దాదాపు 2 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని గుర్తు చేశారు. రైతులు అధిక ఆదాయం ఇచ్చే ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు.

రైతుల సమస్యను గుర్తించి వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రైతులు, నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పథకాలు అమలు చేస్తోందని వారు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు. రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కృషి చేసిన 'జనంసాక్షి'కి రైతులు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో చిగురుమామిడి ఉపసర్పంచ్ కాశబోయిన విజయలక్ష్మి రాజుయాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మహమ్మద్ కుతుబుద్దీన్, ఆలయ డైరెక్టర్ పూల లచ్చిరెడ్డి, వంగ కనకయ్య, పచ్చిమట్ల జగన్ గౌడ్, పూదరి వేణుగోపాల్, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు గట్టు ప్రశాంత్, బోయిని ప్రశాంత్, వంటకాల రంజిత్ రెడ్డి, కొనుగోలు సెంటర్ ఇంచార్జ్ రాగుల శ్రీకాంత్ రెడ్డి, రాగుల నవీన్ రెడ్డి, ఏఈఓలు ఎగ్గోజు సాయికుమార్, ప్రణయ్, హమాలీ కార్మికులు చంద్రయ్య, భాస్కర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతరాముల కళ్యాణానికి బారీ పోలీసు బందోబస్తు ఏర్పాట్లు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 25 (జనంసాక్షి) :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి ఆలయం ముస్తాబవుతుంది. ఈనెల 19న ప్రారంభమైన సీతారామచంద్ర స్వామి నవరాత్రి మహోత్సవంలో భాగంగా 27 శుక్రవారం చైత్రశుద్ధ నవమి రోజు నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణం కన్నుల పండుగ నిర్వహించడానికి ఆలయ అధికారులు అన్ని రకాల ఏర్పాటు చేస్తున్నారు. ఈ కళ్యాణ మహోత్సవానికి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రల నుండి సుమారు లక్ష మందికి పైగా భక్తులు వస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.ఆలయ పార్కింగ్ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివార్చన వేదికపై శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు.భక్తులు కళ్యాణోత్సవాన్ని తిలకించెందుకు 15 సెక్టార్లుగా విభజించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రూ.20 లక్షలతో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.రాజన్న భక్తుల సౌక ర్యార్థం విశాలమైన చలువ పందిళ్లు,దూరం నుంచి కూడ కల్యాణాన్ని తిలకించేలా 8 ఎస్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. వేసవికాలం కావడంతో చల్లదనం కోసం కూలర్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు తాగునీరు,మజ్జిగ పంపిణీ చేసినందుకు ఏర్పాటు చేస్తున్నారు. కల్యాణం పూర్తయిన వెంటనే భక్తులకు భీమన్న దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 5 గంటలకు రాజన్న ఆలయం ముందు నుంచి పట్టణంలో స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. రామయ్య కల్యా ణానికి ఎస్పీ మహేష్ బీ గీత ఆధ్వర్యంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేయనున్నట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.




## వికారాబాద్ స్టీల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

**వికారాబాద్ (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లాలోని ఓ స్టీల్ ఫ్యాక్టరీలో బుధవారం భారీ పేలుడు సంభవించింది. పరిగి మండలం లక్ష్మీదేవిపల్లిలో ఈ ఘటన జరిగింది. సుగ్న మెటల్స్ లిమిటెడ్ కంపెనీలో ఒక్కసారిగా స్టీల్ ప్లాంట్ బట్టీ పేలడంతో మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దట్టమైన పొగ వెలువడుతుండటంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ పేలుడు ఘటన సమయంలో కంపెనీలో ఉన్న పలువురు కార్మికులకు గాయాలైనట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావలసి ఉంది. పేలుడు నేపథ్యంలో కంపెనీ యాజమాన్యం ఎవ్వరినీ లోపలికి అనుమతించడం లేదు. ప్రమాదం జరిగిన వెంటనే మీడియా, స్థానికులు అక్కడికి చేరుకోగా, సెక్యూరిటీ సిబ్బంది గేట్లు వేసి లోపలికి ఎవరినీ రానివ్వలేదు. ఘటన గురించి ప్రశ్నించగా, అది ప్లాంట్ పేలుడు కాదని, కేవలం లారీ టైర్ పేలిందని చెప్పి వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు శ్రమిస్తున్నారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అదనపు ఫైర్ ఇంజన్లను కూడా రప్పించినట్లు తెలుస్తోంది. పరిస్థితి అదుపులోకి వచ్చాకే ఎవరైనా గాయపడ్డారా? ప్రమాదానికి గల కారణాలేంటి? అనే విషయాలు తెలిసే అవకా శం ఉందని ఫైరింజన్ అధికారులు పేర్కొన్నారు.

# అమ్రాబాద్ గిరిజనులకు అండ

- వారికి ప్రత్యామ్నాయ కాలనీ నిర్మాణం
- ఒక్కో కుటుంబానికి 15లక్షల పరిహారం
- నగదు అందచేసిన డిప్యూటి సిఎం భట్టి



**హైదరాబాద్, మార్చి25 (జనంసాక్షి) :** అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో నివసిస్తున్న గిరిజనుల పునరావాసానికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గిరిజనుల అభీష్టం మేరకే పునరావాసం చేపడుతున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొదటి దశలో నాలుగు గ్రామాలకు చెందిన 417 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా అసెంబ్లీ కౌన్సిల్ హాల్‌లో 14 గిరిజన కుటుంబాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా 160 కుటుంబాలకు నగదు పరిహారం ఇవ్వగా, 257 కుటుంబాలకు ఇల్లు, 5 ఎకరాల భూమిని కేటాయిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బచారం వద్ద ఆధునిక సదుపాయాలతో పునరావాస కాలనీని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం మొత్తం రూ.62.55 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. పునరావాసం తర్వాత గిరిజన కుటుంబాలకు పక్కా ఇళ్లు, తాగునీరు, విద్యుత్, ఆరోగ్య సేవలు అందుబా టులో ఉంటాయని అధికారులు తెలిపారు. గిరిజన పిల్లలకు ఆధునిక పాఠశాలలు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు కూడా కల్పించనున్నారు. దేశంలోనే అత్యధిక పరిహా రాల్లో ఒకటిగా భావిస్తున్న రూ.15 లక్షల ప్యాకేజ్ ద్వారా గిరిజనులకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా, ఈ పునరావాసం ద్వారా సుమారు 1501 హెక్టార్ల అటవీ భూమి పునరుద్ధరణకు అవకాశం లభిం చనుంది. పులులు, ఇతర వన్యప్రాణుల సంం క్షణకు ఇది కీలకంగా మారనుంది. బచారం పునరావాస కాలనీని మోడల్ గ్రామంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## ఏప్రిల్ 1 నుండి చికెన్ షాపుల బంద్

- మార్జిన్ తగ్గించడంపై పౌల్ట్రీ కంపెనీలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 1 నుండి బంద్
- తెలంగాణ చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా షాపులు మూతపడే ఛాన్స్




**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలోని మాంసం ప్రియులకు తెలంగాణ చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం బిగ్ షాక్ ఇచ్చింది. పౌల్ట్రీ కంపెనీలు తమకు ఇచ్చే కమీషన్, మార్జిన్‌ను భారీగా తగ్గించడాన్ని నిరసిస్తూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా చికెన్ షాపులను మూసివేయాలని (బంద్) నిర్ణయించారు. దీనికి సంబంధించి ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాల్లో పోస్టర్లు వెలిశాయి. పౌల్ట్రీ కంపెనీల ఏకపక్ష నిర్ణయాల వల్ల చిరు వ్యాపారుల మంతా తీవ్రంగా నష్టపోతున్నామని, మార్జిన్ పెంచే వరకు తమ పోరాటం ఆపేది లేదని అసోసియేషన్ స్పష్టం చేసింది.

ప్రస్తుతం చికెన్ ధరలు ఆకాశాన్నంటుతున్నప్పటికీ, విక్రయదారులకు వచ్చే లాభం మాత్రం గణనీయంగా తగ్గిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వేసవి కాలం, ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగిందని, అయితే ఆ భారం అంతా తమపైనే పడుతోందని చికెన్ షాప్ ఓనర్స్ ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం, పౌల్ట్రీ కంపెనీలు వెంటనే స్పందించి మార్జిన్ సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నిరసనను నిరవధికంగా కొనసాగిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

## ప్రాంతీయ అసమానతల పేరుతో ప్రజలను విడదీయొద్దు

- సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రాంతీయ అసమానతల పేరుతో ప్రజలను విడదీయాలని చూస్తున్నారా అని ఆయన నిలదీశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తే సీఎం వచ్చిన నష్టమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి మహిళలంటేనే ద్వేషమని, అందుకే 50 ఏళ్ల పాలనలో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు కాపీలను చింపిన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలతో అంటకాగుతున్నారని ఆయన విమర్శించారు. ఎన్ని కుట్రలు చేసినా మహిళా రిజర్వేషన్లను అమలు చేసి తీరుతామని బండి సంజయ్ అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ సీట్ల సంఖ్యను పెంచితే దక్షిణాదికి జరిగే నష్టమేంటని బండి సంజయ్ నిలదీశారు. ప్రతి రాష్ట్రంలోనూ 50 శాతం సీట్లను పెంచితే అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. ఇంకెన్నాళ్లు ప్రాంతీయ అసమానతల పేరు చెప్పి చలి కాచుకుంటారని, మీలో దేశభక్తి, జాతీయవాదం మచ్చుకైనా కన్పించవా అని ధ్వజమెత్తారు. దేశాన్ని విభజించే రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటమి ఓడిపోతుందనే వణుకు సీఎంలో మొదలైందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా అక్కడ కాంగ్రెస్ పాచికలు పారడం లేదని అర్థమైందని, అందుకే దక్షిణాదికి అన్యాయం అంటూ కొత్త డ్రామా మొదలుపెట్టారని విమర్శించారు. త్వరలోనే తమిళనాడు, కేరళ ప్రజలు కాంగ్రెస్ భాగస్వామ్య పక్షాలకు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని బండి సంజయ్ కామెంట్ చేశారు.

## ఘనంగా ధూళిపాళ్ల నరేంద్ర కూతురి వివాహం

**హాజరై ఆశీర్వదించిన సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి**



**గుంటూరు, మార్చి 25 (జనంసాక్షి) :** గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చిన్న కుమార్తె వివాహానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్ర బాబు, రేవంత్‌రెడ్డి హాజర య్యారు. గుంటూరులోని శ్రీ కన్వెన్షన్‌లో నాగసాయి వైదీప్తి- కెవిన్ రామ్ వివాహం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎంలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారితో పాటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, అనిత, సంధ్యారాణి, సవిత, పలువురు ఎమ్మెల్యేలు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఖాళీ చేయండి

- అక్బర్ రోడ్డు కార్యాలయం ఖాళీకి నోటీసులు



**న్యూఢిల్లీ, మార్చి25 (జనంసాక్షి) :** దేశ రాజధానిలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి అధికారులు నోటీసు అందించారు. ల్యుటియన్స్ జోన్ ఖాళీ చేయాలని అక్బర్ రోడ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయానికి ఎగ్జిట్ నోటీసు ఇచ్చారు. అలాగే 5వ నెంబర్ రైసినా రోడ్‌లోని యూత్ కాంగ్రెస్ ఆఫీస్‌ని కూడా ఖాళీ చేయాలని ఆదేశించారు. మార్చి 28లోపు రెండు ప్రాంగణాలను ఖాళీ చేయాలని డెడ్‌లైన్ విధించారు అధికారులు. 1978 నుంచి అంటే దాదాపు 48 ఏళ్ల నుంచి అక్బర్ రోడ్‌లోని ప్రధాన కార్యాలయం కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను కాంగ్రెస్ నిర్వహిస్తోంది. అయితే, బలవంతపు తొలగింపును అడ్డుకునేందుకు న్యాయపరమైన మార్గాలను పరిశీంచి కోర్టును ఆశ్రయించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మరోవైపు, గతేడాది కోట్లా మార్గ్‌లో తమ కొత్త ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. అయినప్పటికీ అక్బర్ రోడ్ ప్రాంగణాన్ని ఇంకా ఖాళీ చేయలేదు. పార్టీ కార్యకలాపాలు అక్కడే కొనసాగుతున్నాయి. అక్బర్ రోడ్ కార్యాలయంతో తమకు ఎంతో భావోద్వేగ బంధం ఉందని పలువురు పార్టీ సీనియర్లు చెబుతున్నారు. ఈ భవనానికి చరిత్రలో అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఒకప్పుడు బ్రిటిష్ పాలనలో వైస్రాయ్ లార్డ్ లిన్లిత్‌గో కార్యనిర్వాహక మండలి సభ్యుడైన సర్ రెజినాల్డ్ మాక్స్‌వెల్ ఇక్కడే నివసించారు. 1960ల ప్రారంభంలో భారతదేశంలో మయన్మార్ రాయబారి అయిన డా.ఖిన్ కీ నివాసంగా ఉండేది. ఆ తర్వాత నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్న డా.ఖిన్ కీ కుమార్తె ఆంగ్ సాన్ సూకీ చాలా సంవత్సరాలు అక్కడే నివాసం ఉన్నారు. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం చెందింది. దీంతో పార్టీ చీలిపోయే పలిస్థితులు వచ్చాయి. ఇందిరాగాంధీ వర్గానికి పార్టీ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఓ భవనం కావాల్సి వచ్చింది. ఇందిరా గాంధీకి విధేయుడైన అప్పటి రాజ్యసభ ఎంపీ జి.వెంకటస్వామి అక్బర్ రోడ్‌లోని తన బంగ్లాను ఇచ్చారు. ఇక, అప్పటి నుంచి కాంగ్రెస్ తరఫున ప్రధానమంత్రులైన రాజీవ్ గాంధీ, పి.వి.నరసింహారావు, మన్మోహన్ సింగ్ సహా అందరూ దీన్ని ప్రధాన కార్యాలయంగా కొనసాగించారు.

## అగ్నివీరులకు 20% రిజర్వేషన్లు కల్పించండి

- అన్ని రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అగ్నివీరులకు ఆయా విభాగాల్లో 20శాతం ఉద్యోగాలు రిజర్వ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అన్ని రాష్ట్రాలకు లేఖ రాసింది. అగ్నివీర్ తొలి బ్యాచ్ నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకొని 2027లో బయటకు రానున్న నేపథ్యంలో.. వారికి ఆయా రాష్ట్రాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్రం భావిస్తోంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు సహా పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అగ్నివీరులకు రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.ప్రభుత్వ నియామకాల్లో అగ్నివీరులకు కనీసం 20శాతం ఉద్యోగాలు రిజర్వ్ చేయాలని సిఫార్సు చేస్తూ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా (ఎంటిబి నాష్ట్రజీష్ట్ర) లేఖ రాశారు. త్రివిధ దళాల్లో పదవీ విరమణ చేసిన వారికి మాదిరిగానే అగ్నివీరులకు కూడా రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించాలని అందులో పేర్కొన్నారు. ముఖ్యంగా ఫారెస్ట్ గార్డులు, మైనింగ్ గార్డులు, పోలీస్ కానిస్టేబుల్, ఫైర్‌మెన్, జైలు వార్డెన్లు, ప్రత్యేక పోలీస్ అధికారులు, ఎస్డీఆరఎఫ్ విభాగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు.అగ్నివీరుల రిజర్వేషన్లకు సంబంధించి ఇప్పటికే పలు రాష్ట్రాలు చర్యలు చేపట్టాయి. పోలీస్, మైనింగ్ గార్డులు, జైలు వార్డెన్ సహా పలు విభాగాల్లో అగ్నివీరులకు ప్రాధాన్యం కల్పిస్తామని ప్రకటించిన రాష్ట్రంగా హరియాణా తొలి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు కూడా వీరికి రిజర్వేషన్‌లు కల్పిస్తామని వెల్లడించాయి.

# అరటి రైతులను ఆదుకోండి

- గిట్టుబాటు ధరలు కల్పించండి
- అరటి గెలలను వేసుకుని రైతులతో ర్యాలీ
- కడప కలెక్టరేట్ వద్ద ధర్నాకు యత్నం
- వైఎస్ షర్మిల డిమాండ్



**కడప, మార్చి 25 (జనంసాక్షి) :** అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వైఎస్ షర్మిల కోరారు. కోల్డ్ స్టోరేజీ సౌకర్యాల విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నానని తెలిపారు.ఎన్నికల ముందు ప్రచారం కోసం మాత్రమే పులివెందులలో అరటి ప్రాసెసింగ్ యూనిట్‌ను జగన్ ప్రారంభించారని విమర్శలు చేశారు. అరటి రైతుల సమస్యలపై కూడా షర్మిల స్పందించారు. పంట నష్టపోయిన అరటి రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కడపకు వచ్చిన వైఎస్ షర్మిల రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి వ్యానులో అరటి గెలలు వేసుకొని ర్యాలీగా కడప కలెక్టరేట్ కు చేరుకున్నారు. పంట నష్టపోయిన అరటి రైతులను తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్ షర్మిల రెడ్డి మాట్లాడారు. నిన్న పులివెందుల నియోజక వర్గం సింహాద్రిపురం మండలం లోని కసునూరు గ్రామంలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నానన్నారు. రైతులు తమ దఅష్టికి తెచ్చిన సమస్యలను జిల్లా జాయింట్ కలెక్టర్ వివరించడం జరిగిందన్నారు. అకాల వర్షానికి అరటి తోటలు పూర్తిగా దెబ్బతిని రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. మన రాష్ట్రంలో అరటి 70 నుంచి 80 లక్షల వరకు పండిస్తున్నారని తెలిపారు. 58 శాతం రాయలసీమ నుండి అరటి పండుతోందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లేక కొట్టుమిట్టాడు తున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టన్ను 26 వేల రూపాయలు పలికిన అరటి ఈరోజు 6 వేల రూపాయల కన్నా తక్కువగా పడిపోయిందన్నారు. దేశంలోనే మన రాష్ట్రంలో బెస్ట్ క్వాలిటీ అరటి పంట సాగు అవుతుందని, ఇతర దేశాలకు ఎక్స్పోర్ట్ చేసుకుంటారన్న నమ్మకంతో రైతులు అరటి పంటను పండించారన్నారు. ప్రస్తుతం రేటు పడిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోతున్నారన్నారు. రైతులు పండించిన పంటను గిట్టుబాటు ధర వచ్చేంతవరకు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు లేక ప్రాసెసింగ్ ప్లాంట్ లు లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేయడంతోపాటు మార్కెటింగ్ సపోర్ట్ కల్పించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అరటికి కనీస గిట్టుబాటు ధర 12 వేల రూపాయలు కల్పించాలన్నారు. ధరల స్థిరీకరణ నిధులను రైతుల మేలు కోసం ఉపయోగించాలన్నారు. వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి తమ టార్గెట్ కానే కాదని వైయస్ షర్మిలారెడ్డి అన్నారు. పులివెందుల అరటి రైతులతో కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు.

## హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు రెడ్ అలర్ట్

- నగర శివార్లలో వడగళ్ల వాన
- రాబోయే 2-3 గంటల్లో అతి భారీ వర్షాలు!



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. హైదరాబాద్ మహానగరంతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో కుండపోత వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ అలర్ట్' ప్రకటించారు.

ఇప్పటికే హైదరాబాద్ నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం మళ్లీ మొదలైంది. వనస్థలిపురం, హయత్ నగర్, అబ్దుల్లాపూర్ మెట్‌లో కొన్ని చోట్ల వడగళ్ల వర్షం కురుస్తోంది. అదేవిధంగా ఘట్కేసర్, పోచారం, అన్నోజిగూడ, నారపల్లిలో వర్షం మోస్తారుగా పడుతోంది. అదేవిధంగా హైదరాబాద్, రంగారెడ్డి కాకుండా మరికొన్ని జిల్లాలకు కూడా భారీ వర్ష సూచన ఉంది. మరోవైపు మంచిర్యాల, నారాయణపేట్, వికారాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేశారు. ప్రకటించారు. ఆయా ప్రాంతాల్లో రాబోయే 2 నుంచి 3 గంటల్లో ఈ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

## తేనెటీగల దాడితో పరుగులు

- గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

**నంద్యాల, మార్చి 25 (జనంసాక్షి) :** శ్రీశైలం డ్యామ్ వద్ద తీవ్ర విషాదం నెలకొంది. తేనెటీగల దాడిలో ఓ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయారు. పిల్లి వీరస్వామి(52) అనే స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్.. శ్రీశైలం డ్యామ్ వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో ఉండగా వీరస్వామిపై తేనెటీగలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. విపరీతంగా కుడుతుండడంతో తప్పించుకునే ప్రయత్నం చేశాడు.. దాడి నుంచి తప్పించుకునే క్రమంలో పరుగులు తీశారు. ఒక్కసారిగా గుండెపోటు రావడంతో మృతిచెందారు. కానిస్టేబుల్ మృతి బాధిత కుటుంబం, డిపార్ట్‌మెంట్‌లో తీరని శోకాన్ని మిగిల్చింది.

## రామ్‌చరణ్ కోలుకున్నాడు: పెద్ది టీమ్

**హైదరాబాద్, మార్చి 25 (జనంసాక్షి) :** 'పెద్ది' సినిమా సెట్స్‌లో రామ్‌చరణ్‌కు గాయపడటంపై టీమ్ స్పందించింది. ప్రస్తుతం ఆయన కోలుకున్నారని తెలిపింది. సెట్స్‌లో చరణ్ కుడి కంటికి స్వల్ప గాయమైందని, వెంటనే తగిన చికిత్స జరిగిందని పేర్కొంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిమానులకు సూచించింది. చరణ్ గాయం విషయంలో వస్తున్న రూమర్లను నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. గురువారం నుంచి చరణ్ మళ్లీ షూటింగ్‌లో పాల్గొంటారని తెలిపింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370